AL - HILAL

# నె(ల)వంక

మాస పత్రిక

Vol 5, Issue: 30 April - 2009

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى




## పీస్ హైదరాబాద్

## IMA పిక్నిక్

الَّذِينَ يَتَّبِعُونَ الرَّسُولَ النَّبِيَّ الأُمِّيَّ الَّذِي يَجِدُونَهُ مَكْتُوبًا عِندَهُمْ فِي التَّوْرَاةِ وَالإِنْجِيلِ يَأْمُرُهُم بِالْمَعْرُوفِ وَيَنْهَاهُمْ عَنِ الْمُنكَرِ وَيُحِلُّ لَهُمُ الطَّيِّبَاتِ وَيُحَرِّمُ عَلَيْهِمُ الْخَبَآئِثَ وَيَضَعُ عَنْهُمْ إِصْرَهُمْ وَالأَغْلاَلَ الَّتِي كَانَتْ عَلَيْهِمْ فَالَّذِينَ آمَنُواْ بِهِ وَعَزَّرُوهُ وَنَصَرُوهُ وَاتَّبَعُواْ النُّورَ الَّذِيَ أُنزِلَ مَعَهُ أُوْلَـئِكَ هُمُ الْمُفْلِحُونَ. (سورة الأعراف: ١٥٧)



అతని (దైవ సందేశహరుదు, నిరక్షరాసుడైన ముహమ్మద్ (స)) ప్రస్తావన వారికి తమవద్ద ఉన్న తౌరాత్, ఇన్‌జీలు గ్రంథాలలో వ్రాయబడి లభిస్తుంది. ఆతను వారికి మంచిని ఆజ్ఞాపిస్తాడు. చెడుల నుండి వారిస్తాడు. వారికొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషేధిస్తాడు. వారి మీద మోపబడివున్న (ఆంక్షల) భారాన్ని దించుతాడు. వారు బంధింపబడి ఉన్న శృంఖలాలను త్రెంచుతాడు. కనుక ఎవరు అతనిని విశ్వసించీ సమర్థించీ అతనికి సహకరించీ అతనితో అవతరింపజేయబడిన జ్యోతి (ఖుర్‌ఆన్)ని అనిసరిస్తారో వారే సార్థక జీవులు. వారినే విజయం వరిస్తుంది. (ఆరాఫ్: 157)

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 5, ISSUE: 30
APRIL 2009

CHIEF PATRON
Muhammad Ismail Ansari


GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN



Noushad Zainulabdeen

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait

PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT



రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఏయిర్ పోర్టు- హైదరాబాదు

## ఈ సంచికలో....

| | |
|---|---|
| కారుణ్య వ్యవస్థ | 2 |
| కవితలు | 3 |
| షీక్ హైదరాబాద్ | 4 |
| అనురాగ గోపురం | 6 |
| అభిమాన ధనులు కండి | 7 |
| గజ్వయె తబూక్ | 8 |
| ఏ గూటి చిలుక ఆ గూటి ... | 9 |
| మోహావకాటం మోతాదుకు మించితే | 10 |
| ఆచ్ఛాదన | 12 |
| సీరత్ క్విజ్ | 13 |
| ఇస్లాం నిర్దిష్ట వాగ్దానం | 14 |
| హజ్రత్ ఫాతిమా(ర) | 15 |
| IMA పిక్నిక్ | 16 |
| సలాం హైదరాబాద్ | 18 |
| ఉత్తరాలు | 20 |









❖ الإسلام نظام الرحمة ❖ نشيد ❖ أخبار مسلمي الهند ❖ البيت المثالي ❖ الدين النصيحة (مهتدية)
❖ تلخيص الرحيق المختوم ❖ الناس علي دين الملوك ❖ الحذر. . .الحذر. . .من التكلف غير الضروري
❖ تربية المهتدين ❖ أسئلة عن سيرة النبي ﷺ ❖ صفات المؤمن ❖ السيدة فاطمة بنت محمد ﷺ
❖ أخبار اللجنة ❖ معلومات عامة عن ولاية حيدرأباد ❖ رسائل الهلال

# కారుణ్య వ్యవస్థ ఇస్లాం

నిజం చెప్పాలంటే- నేడు చెలామణిలో ఉన్న మతాలు, మార్గాలు అన్నీ కూడా ఒకప్పుడు మనిషికి పర అపర విద్యల్ని నేర్పి అతని సామాజిక, ధార్మిక జీవితానికి మేలు చేసేందుకే ఉనికిలోకి తేబడ్డాయి. ఇందులో ఇస్లాంకు గల ప్రత్యేకత ఏమిటంటే- అది అన్ని విధాల సమగ్రము, సంపూర్ణమైనది. ఇస్లాం ఆదర్శాలు, నీతి సూత్రాలు ఏ హోదాలో, ఏ జీవన విధానాలు, ఆలోచనాధోరణులు ఉన్న వారికైనా ఆమోదయోగ్యంగా ఉన్నాయి. ఆ మాటకొస్తే తిరుగు లేనివి కూడా. ఇ.వి రామస్వామి పెరియార్ మాటల్లో చెప్పాలంటే- **"ముహమ్మద్(స) నబీ ప్రబోధాల్లోని అనేక అంశాలు తిరిగులేనివే కాదు, అందరికీ ఆమోదయోగ్యమైనవి కూడా. ఇది నిజంగా ఎంతో ప్రశంసనీయమైన విషయం"** (విడుతల్ పత్రిక- 23-12-1953)

ఇస్లాం – అది మానవుని ప్రకృతి సిద్ధమైన ధర్మం. అది ప్రత్యేకంగా ఒక జాతికి, ఒక దేశానికి చెందినది కాదు. ప్రతి యుగంలోనూ, ప్రతి జాతి, ప్రతి దేశంలోనూ నివసిస్తూ వచ్చిన దైవభక్తులూ సత్యప్రియులూ అయిన సజ్జనులందరూ అనుసరించిన ధర్మంలోనూ, తమ భాషల్లో వారు దీన్ని శాంతి అని పిలిచినా, విధేయత అన్నా, స్వయం సమర్పణ అని చెప్పినా వారందరని ధర్మం- ఇస్లాం. వారందరూ విశ్వాసులే, విధేయులే, ముస్లింలే. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది **"ఆయన (అల్లాహ్) నూహ్‌ను ఆదేశించిన ధర్మ మార్గాన్నే మీ కోసం నిర్దేశించాడు. (ప్రవక్తా!) దానినే ఇప్పుడు దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపాము. ఈ ధర్మమార్గాన్నే మేము ఇంతకు పూర్వం ఇబ్రాహీమ్, మూసా, ఈసా(అలైహిముస్సలాం) లకు కూడా అందజేశాము. (అపై) ధర్మమార్గాన్ని స్థాపించాలని, విబేధాలు సృష్టించరాదని తాకీదు చేశాము."** (షూరా: 13)

భారతదేశ విషయానికొస్తే- సాంప్రదాయమైన, బలీయమైన సామాజిక సర్వమానవ సమానత్వాన్నీ తద్వారా సామాజిక సుహృద్భావ పరిస్థితులనూ ప్రోత్సహిస్తున్న ఇతర మతాలు ఏమిటా అని ఆలోచిస్తే, ప్రత్యేకంగా ఇస్లాం ప్రముఖంగా ప్రథమ స్థానంలో కనిపిస్తుంది. బిపిన్ చంద్రపాల్ ఇలా అన్నారు: **"ఆయా కులాల సమాజాల సభ్యులుగా మనకున్న ప్రత్యేక హోదాకు తోడు మనకు రాజకీయ హక్కు ఇచ్చింది ముస్లిములే. అందులో(ఇస్లాం)నే నికార్సయిన ప్రజాస్వామ్యానికి పునాది ఉందు, అందులోనే నిజమైన జాతీయ భావనం ఉంది. అందులోనే నిజమైన పౌరసమానత్వానికి ఆధారం ఉంది."** (బి. ఎన్.గంగూలి 1975:61)

నవీనా హిందూ సిద్ధాంతకర్త మాటల్లో చెప్పాలంటే: **"వాస్తవికంగా నిత్య జీవన విధానంలో ఏ మాత్రం ప్రశంసనీయమైన స్థాయిలోనైనా సమానత్వాన్ని ఏ మతమైన పాటిస్తుందంటే అది ఇస్లాం... కేవలం ఇస్లాం మాత్రమే."** (బి. ఎన్.గంగూలి 1975:126)

అయితే –కారుణ్య వ్యవస్థ ఇస్లాం మొత్తం ప్రపంచ ప్రజలందరికీ ఆమోదయోగ్యమైనా, అది అన్ని రకాల వారికీ, అనుకూలమైనదీ సమంజసమైన సహేతుకమైనదీ అయినా ఒక అత్యుత్తమ ఆదర్శాన్ని వ్యతిరేకించేవాళ్ళు సదా ఉంటూనే వచ్చారు. ఇక మీద కూడా ఉంటారు. అది సహజం. ప్రపంచంలోని జనమంతా ఒక ఉద్దేశం, ఒకే లక్షణం, ఒకే సంస్కృతి కలిగి ఉండాలంటే చెప్పేంత సులభం కాదు కూడా. మనుషుల మధయ వివధ రకాలైన భేదాలు ఎప్పుడూ ఉంటాయి. అందుకు కారణాలెన్నో..!! ప్రపంచ ప్రజల మధ్య భేదాలు, వైరుధ్యాలు సహజమే. అయినప్పటికీ 'జార్జ్ బెర్నాడ్ షా" అన్నట్టు: **"నేటి పరిస్థితుల్లో ముహమ్మద్(స) ను ఒక నియంతలా పోలిస్తే ప్రపంచంలో సుఖశాంతులు పరిఢవిల్లుతాయి."**

## ఓ అల్లాహ్!
## నీ సూచనలే ఎటు చూసినా..

జీవితం జడపదార్థంగా మారినా
లేక జీవనదై ప్రవహించినా
మనసు భారంగా కదిలినా
లేక మమకారంతో కరిగినా
కదిలే ప్రతి క్షణం, గడిచే ప్రతి ఘడియలో
నీ సూచనలే ఎటు చూసినా...

మధుర ఘట్టాలు గుర్తొచ్చినా
తీరని దుఃఖాలు ఎదురొచ్చినా
అనుకున్న పనులు సాధించినా
అనుకోనిదేదైనా స్థంభవించినా
నీ సూచనలే ఎటు చూసినా...

తెలతెల్లని మంచు కరిగినా
సుతిమెత్తని గాలి వీచినా
సుగంధ మల్లెలు పూసినా
ఇంద్రధనస్సు రంగులు కన్పించినా
కురిసే ప్రతి వాన చినుకులో
వచ్చే ప్రతి వసంత ఋతువులో
నీ సూచనలే ఎటు చూసినా...

ఏకాంత కుహారంలో ఒంటరిగా ఉన్నా
నలుగురితో కలిసి తిరుగుతున్నా
వెండి వెన్నెల్లో నడుస్తున్నా
మండుటెండల్లో పయనిస్తున్నా
పచ్చిక బయళ్ళ మధ్య విహరిస్తున్నా
సహారా ఎడారిలో విరహాగ్ని భరిస్తున్నా

ఓ అల్లాహ్! నీ సూచనలే ఎటు చూసినా..

## ప్రవక్త శ్రీ (స)

ఇబ్రాహీమ్ ప్రార్థనా ఫలితం ప్రవక్త శ్రీ
ఈసా సువార్త రూపం ప్రవక్త శ్రీ
దాన ధర్మాల్లో ప్రభంజనం ప్రవక్త శ్రీ
ప్రేమానురాగాల్లో ఆదర్శం ప్రవక్త శ్రీ

స్త్రీ స్వర్గానికి సోపానం చెప్పింది ప్రవక్త శ్రీ
స్వర్గం తల్లి పాదాల చెంత అనింది ప్రవక్త శ్రీ
ఆకలి బ్రతకుల ప్రతిధ్వని ప్రవక్త శ్రీ
జాలి గుండె గల దైవ ప్రతినిధి ప్రవక్త శ్రీ
మానవాళి పాలిట మూర్తీభవించిన కారుణ్యం ప్రవక్త శ్రీ
మృగ మనస్కుల పాలిట ఉగ్ర రూపం ప్రవక్త శ్రీ

జనారణ్యాన్ని జీవనవనం చేసింది ప్రవక్త శ్రీ
జ్ఞానాభ్యుదయానికి జీవం పోసింది ప్రవక్త శ్రీ
బానిస వ్యవస్థను రూపుమాపింది ప్రవక్త శ్రీ
బడుగు వర్గాలను బలపరిచింది ప్రవక్త శ్రీ
అసూయ దేవషాలను రూపుమాపింది ప్రవక్త శ్రీ
అపూర్వ సోదరీకరణకు నాంది వేసింది ప్రవక్త శ్రీ

ఆకాశవాణిని నేలకందించింది ప్రవక్త శ్రీ
ధర్మశాస్త్రాన్ని పరిపూర్ణంగావించింది ప్రవక్త శ్రీ
అమీన్ సాదిఖ్‌ల బిరుదు పొందింది ప్రవక్త శ్రీ
అందరివారని నీరాజనాలందుకుంటున్నది ప్రవక్త శ్రీ

కాబట్టి జనులారా!
సల్లూ అలైహి వ ఆలిహి
హసునత్ జమీవు ఖిసాలిహి

"సల్లల్లాహు అలైహి వ ఆలిహి వసల్లం"

హాఫీజ్ ఎస్.ఎమ్ రసూల్

# పీస్ హైదరాబాద్

## (సామాజిక చింతనగల నగరవాసులకు, ముస్లింలకు

**గమనిక: ఇవి ప్రముఖ అన్ని రాజకీయ పార్టీలకూ పంపబడిన ఒక లేఖ. ఈ లేఖతోపాటు ముస్లింల డిమాండ్లకు సంబంధించిన ఒక నివేదిక కూడా అన్ని రాజకీయ పార్టీలకు పంపించబడింది.**



చాలా కాలం నుంచి ఒక విషయం ముస్లిం వర్గ మనోమస్తిష్కాలను తీవ్రంగా కలచివేస్తోంది. అదేమిటంటే వివిధ రాజకీయ పార్టీలు వారిపట్ల విద్వేష వైఖరిని అవలంబించాయి. అఖండ జాతీయత నుంచి వారిని వేరుగా ఉంచడానికి ప్రయత్నం జరిగింది. జాతీయ వనరుల్లో నుంచి ముస్లింలకు చెందవలసిన హక్కును వ్యవస్థీకృత రూపంలో తగ్గిస్తూ రావటం జరిగింది. ముస్లింల పరిస్థితిని చక్కదిద్దటంలో అన్ని రాజకీయ పార్టీలూ విఫలమైనాయి. అక్కరకురాని వాగ్దానాలతో ముస్లింలను కేవలం ఒక ఓటు బ్యాంకులాగా మాత్రమే ఉపయోగించుకుంటూ వచ్చాయి.

ముస్లింల కష్టాలు తీరి వారి ఆశలు, అభిలాషలు నెరవేరాలి. ముస్లింల అభివృద్ధికి మార్గాన్ని సుగమం చేసే విధంగా ఒక అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలి. ప్రస్తుత మూడు ముఖ్య శాఖలైన న్యాయశాఖ, కార్యనిర్వాహకశాఖ కేంద్రం, రాష్ట్ర శాసన నిర్మాణశాఖలు (అసెంబ్లీ, పార్లమెంటు) - ఈ శాఖల్లో ప్రజాప్రాతినిధ్యం విషయంలో నెలకొని ఉన్న అసమతౌల్య నిర్మూలన కోసం లేక కనీసం దాని సంస్కరణ కోసమైనా చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని విభాగాల ఉద్యోగాల్లోనూ ముస్లింల శాతం స్వాతంత్ర్యం తరువాత నుంచి క్రమంగా తగ్గుతూ, ప్రస్తుతం 3 శాతం కంటే దిగువకు చేరుకుంది. ఈ పరిస్థితుల మూలంగా ముస్లింలలో సహజంగానే ఆందోళన, అభద్రతా భావం ఏర్పడింది. దీనిని దూరం చేయటానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిన రాజకీయ పార్టీ ఒక్కటీ లేదు. పైగా గోరుచుట్టు మీద రోకలిపోటు అన్నట్టు కొన్ని రాజకీయ పార్టీలు ముస్లింలలో మరింతగా భయాందోళనల్ని కల్గించి వారి నుంచి ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ఈ సందర్భంగా ముస్లింలకు కావలసింది అందమైన వాగ్దానాలు కాదు, కొన్ని ఫలవంతమైన, కట్టుదిట్టమైన చర్యలకు అమలు జరపాలని ముస్లింలు కోరుతున్నారు. తలమీద టోపీలు ధరించి హజ్‌హౌస్‌కు ఒకటి రెండు సార్లు వచ్చివెళ్తేనో లేక ఇఫ్తార్ విందులకు ఏర్పాటు చేస్తేనో ముస్లిముల్లో వారికి ఆదరణ లభిస్తుందని అనుకుంటే పొరపాటే. కొన్ని రాజకీయ పార్టీలు అలా భావించటానికి కారణం లేకపోలేదు. ఆయా పార్టీల్లో నాయకుల అడుగులకు మడుగులొత్తే కొంతమంది ముస్లిం లీడర్ల మూలంగా వారు అటువంటి భ్రమలకు లోనవుతున్నారు. రాజకీయ పార్టీలు అలా ఆలోచిస్తున్నట్లయితే వారు తమ భ్రమల నుంచి తొందరగా తేరుకోవాలి. వారి ఈ వైఖరి మొత్తం ముస్లిం సమాజానికే అవమానకరమని గ్రహించాలి. మొత్తానికి ఈ పరిస్థితులన్నిటిపై క్షుణ్ణంగా ఆలోచించిన తర్వాత ముస్లిం వర్గం తమకు అత్యవసరమైన, అతివేగంగా పూర్తిచేయదగిన కొన్ని ముఖ్య డిమాండ్లను తీర్మానించింది. మీరు గనక ఆ డిమాండ్లను పరిశీలించి, మీ పార్టీ ఫోరంలో చర్చ నిమిత్తం ఆ జాబితాను ప్రవేశపెట్టి, వాటిలో మీరు ఎన్ని డిమాండ్లతో ఎంతవరకు ఏకీభవిస్తున్నారన్న విషయం మాకు తెలియపరిస్తే మేము మీకు ఎంతగానో కృతజ్ఞతలు తెలియజేసుకుంటాము. ఈ డిమాండ్ల జాబితా అన్ని రాజకీయ పార్టీలకూ పంపిస్తున్నాం. వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చే జవాబులను చూసి మేము ఆ రాజకీయ పార్టీకు ఓటు వేసే ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయిస్తాము. ఈ డిమాండును వీలైనంత త్వరగా నెరవేరుస్తామనీ, చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటామని సముచిత పద్ధతిలో ఒప్పించిన వారికి మాత్రమే ముస్లిం వర్గం ఓటు వేయబోతుంది. 2009 ఎన్నికల్లో ఒక్క రాజకీయ పార్టీకే ముస్లింలంతా కలిసి ఓటెయ్యాలని ఈ విషయమై విజ్ఞప్తి చేయబడుతుంది.

ఇట్లు
భవదీయుడు

# PEACE HYDERABAD

## (ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాల, ప్రజా సంస్థల ఐక్య వేదిక)



# 2009 ఎన్నికల కోసం ముస్లిం అజెండా

### రాజకీయపరమైన డిమాండ్లు

ముస్లింలు ఈ దేశంలో అతిపెద్ద అల్పసంఖ్యాక వర్గమే కాదు. అతిపెద్ద అధిక సంఖ్యాక వర్గం కూడా. ఎందుకంటే ముస్లింల జనాభాను హిందువుల్లోని ఏ వర్గంతో పోల్చుకున్నా వారికంటే ముస్లింలు సంఖ్యాపరంగా చాలా అధికంగానే ఉంటారు. ఈ పరిస్థితి దృష్ట్యా ముస్లింలకు రాజకీయ అధికారంలో న్యాయంగా తనకు చెందవలసిన వాటాను ఇవ్వమని కోరే పూర్తి అధికారముంది. కనుక వారి డిమాండు ఏమిటంటే

(1) రాష్ట్రంలో డిప్యూటీ ఛీఫ్ మినిస్టర్ పదవి ముస్లింలకు ఇవ్వాలి.

(2) క్యాబినెట్లో ముస్లింలకు వారి జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండాలి.

(3) హోంశాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖ లాంటి కనీసం ఏదైనా ఒక మంత్రి పదవి ముస్లింలకు ఇవ్వాలి.

### భద్రతా పరమైన డిమాండ్లు

ముస్లింల గట్టి భద్రతకు, శాంతియుత జీవనానికి సంబంధించి ఎన్నో కమిషన్ల తరఫున ఇంతకుముందే చాలా సిఫారసులు చేయబడ్డాయి. అదీగాక భారతదేశ పోలీసు వ్యవస్థలోని ఒక చెప్పుకోదగ్గ భాగం నిష్పక్షపాతంగా వ్యవహరించటం లేదన్న సంగతి కూడా ఒక నిరూపిత వాస్తవం. ఈ నేపథ్యంలో ముస్లింలు కోరేదేమంటే:

(1) ముస్లింలకు వారి జనాభా ప్రాతిపదికన పోలీస్ వ్యవస్థలో ప్రాతినిధ్యం ఇవ్వాలి.

(2) తీవ్రవాద నిరోధకానికి సంబంధించిన ఏ కఠినాతి కఠిన చట్టం నిర్మించినా దానిపట్ల ముస్లింలకు ఎలాంటి అభ్యంతరం లేదు. తీవ్రవాద నిరోధకానికి సంబంధించిన ఇతర నాగరిక సమాజాలకు సమ్మతమైన కఠిన చట్టాలన్నీ ముస్లింలకు కూడా సమ్మతమే. అయితే అలాంటి ఏ చట్టమైనా దుర్వినియోగం కాకుండా ఆపటానికి అవసరమైన అన్ని రకాల చర్యలను కూడా నమ్మకమైన రీతిలో చేపట్టాలి. అంతేకాదు, చట్టాన్ని పాటించని వారిని, వారికి సంబంధంలేని ఇతర కేసుల్లో ఇరికించి, అబద్ధపు సాక్ష్యాధారాలను బనాయించి, వాస్తవాలను వక్రీకరించే పోలీసులకు వ్యతిరేకంగా కూడా చట్టపరమైన చర్యలను తప్పనిసరిగా చేయాలి. విచారణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అమాయక జనుల్ని వేధించే పోలీసు అధికారులకు వ్యతిరేకంగా కూడా అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవటాన్ని విశ్వసనమైనరీతిలో చట్టబద్ధం చేయాలి.

(3) అమాయక వ్యక్తుల అరెస్టులు, అనవసర గాలింపులు, వెంబడింపులను నిరోధించటం కోసం చేయబడుతున్న తీర్మానం ఏమిటంటే, చాలా సందర్భాల్లో వ్యక్తుల్ని ఏదైనా ఒక ప్రత్యేక నేరానికి సంబంధించిన అనుమానం మీద అరెస్టు చేస్తారు. కాని వారికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలూ నిరూపించబడవు. లేదా కొన్ని సందర్భాల్లోనయితే వారిమీద ఇతర నేరాలకు సంబంధించిన సెక్షన్‌లు విధించడం జరుగుతుంది. ఈ సంఘటనలన్నిటి గురించి ఏదైనా నిష్పాక్షిక ఏజెన్సీ ద్వారా విచారణ జరిపించాలి. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండానే పోలీసులు కేవలం భయాందోళనకు గురిచేసేందుకు పాల్పడ్డారేమో విచారణ జరిపించాలి. ఒకవేళ అలా జరిగి ఉన్నట్లయితే అమాయక వ్యక్తుల్ని వేధించిన పోలీసు అధికారులకు కూడా అనుగుణంగా కఠినంగా శిక్షపడాలి.

(4) మైనార్టీలపై దౌర్జన్యాలను ఆపేందుకు క్రియాశీలక చట్టాలు తయారు చేయాలి. ఆ చట్టంపై ప్రభావవంతంగా అమలు జరపాలి.

(5) వర్గ వైషమ్యాలకు, తీవ్రవాదానికి సంబంధించిన కేసులను విచారించి దోషులను శిక్షించటానికి త్వరితగతిన తీర్పులు చేసే కోర్టులను ( Fast Tracks Courts ) నెలకొల్పాలి.

(మిగతా 14 వ పేజీలో)

## ఓ భార్యగా నేను

- ఉమ్మె హసన్

### భర్త తల్లిదండ్రి (అత్తా - మామ)

- నేను సాధ్యమైనంత వరకు వారి సేవ చేస్తాను. వారి పనుల్లో చేయూతనిస్తాను. ముఖ్యంగా ఏదైనా విందు సందర్భాన.
- అప్పుడప్పుడు వారికోసం ప్రత్యేకంగా మంచి మంచి రుచికరమైన వంటకాలు చేస్తాను.
- వారి కోసం నేను గిఫ్ట్ తీసుకెళుతుంటాను.
- వారి బంధు-మిత్రులని గౌరవిస్తాను. వారితో మంచిగా పలకరిస్తాను.
- వారితో నేను వారికి అయిష్టమైన వాటి గురించి మాట్లాడను. ఇష్టంలేని వస్తువుల్ని తేవను.
- నేను వారి ముందు వారి కొడుకు గొప్పతనాన్ని పొగుడుతాను. ఆయనలో ఉన్న లోపాలని వారి ముందు గాని, మరెవరి ముందు గాని బహిర్గతం చెయ్యను.
- నేను మా ఇంటివారికి తల్లిదండ్రులను చూసి రమ్మని ఎక్కువగా ప్రోత్సహిస్తాను. వారితో మంచిగా మసలుకోమని హితబోధ కూడా చేస్తాను. సమయం దొరికినప్పుడల్లా నేను వారి దర్శనానికి వెళ్ళేటప్పుడు పిల్లల్ని అవ్వ, తాతని ఎక్కువ విసిగించకుండా కావల్సిన జాగ్రత్తలు తీసుకుంటాను.
- అప్పుడప్పుడు హోటల్ నుండి వారి కోసం మంచి వంటకాలు ఆర్డర్ చెయ్యమని మా శ్రీవారితో రిక్వెస్టె చేస్తాను. వారితో కలిసి భోంచెయ్యటాన్ని ఎక్కువగా ఇష్టపడతాను.

### భిన్న అంశాలు

- మా శ్రీవారు ఇంటికి రావడంలో కాస్త ఆలస్యం అయితే, ఫోన్ చేసి వారి గురించి వారి పని గురించి తెలుసుకుంటాను.
- వారు నా కోసమని తీసుకు వచ్చిన వస్తువుని మెచ్చుకుంటాను. దానిలో లోపాల్ని ఎంచను.
- మా వారికి  ఇష్టమైన వంటకాలు చేసి పెడతాను.
- ఇంటి సామాన్లను అప్పుడప్పుడు ఓ చోట నుండి మరో చోటుకి మారుస్తుంటాను.
- నా ప్రాణమా! ప్రియనేస్తమా! లాంటి ప్రేమతో కూడిన పదాలతో వారిని పిలుస్తాను.
- ఎప్పుడైనా కాస్త తొందరగా మేలుకుంటే ప్రపంచం, ధర్మం గురించి ప్రశ్నలు-సమాధానాలు ఫజ్ర్ నమాజ్ వరకు సాగుతాయి.

## ఓ భర్తగా నేను

- అఖిల్ హసన్

### సేవ

- ఇంట్లో ప్రవేశించాక ఆమె ఎక్కువ బిజి అయితే నేను ఆమె పని బరువుని కాస్త తగ్గించడానికి ప్రయత్నిస్తాను. ఉ: బోకులు తోమటం, దిండ్లు దుప్పట్లు సర్దటం మొదలగు. ఇవన్నీ నేనేదో కొంగచాటు కృష్ణుడినై చేయటంలేదు. ప్రవక్త(స) వారి ఈ ఆదేశం మేరకు "మీలో ఉన్నతుడు తన కుటుంబ సభ్యులతో మంచిగా మసలుకునే వాడే." అన్న సూక్తికి ప్రతి రూపం కాగలగాలన్నదే నా ఆశ. రాత్రి సమయంలో పని భారాన్ని తగ్గించడానికి పిల్లల బాధ్యత పూర్తిగా నేనే స్వీకరిస్తాను.
- అప్పుడప్పుడు ఆమెతో ఇంటి అవసరాల గురించి అడుగుతుంటాను. మాములు రోజుల్లో, పండుగ పూట విందు ఇచ్చే సందర్భాల్లో డబ్బు విషయంలో కాస్త తేడాని పాటిస్తాను. సమయం మార్పుతోపాటు నా చెయ్యిని కాస్త తెరిచి వుంచుతాను. అప్పుడప్పుడు తెలిసే అవసరానికి మించి డబ్బు ఇస్తాను. మనిద్దరి జీవితాలు పునఃనిర్మించబడుతూ ఉండాలన్నదే నా ఆశ.

### బంధువులు

- నేను ఆమె బంధు మిత్రులకు సేవలందిస్తాను. ముఖ్యంగా కష్టాల్లో ఉన్నప్పుడు.
- ఆమె తన బంధువులకి ఏమైనా ఇవ్వదలచుకుంటే ఎదురు చెప్పను. తల్లి దండ్రులకి వెళ్ళి చూసిరా అని ప్రోత్సహిస్తాను.
- నేను ఆమె బందువుల దగ్గరకు వెళితే వారితో మంచి ఉత్సాహంతో చిరునవ్వులు చిందిస్తూ పలకరిస్తాను. సమయం సందర్భాన్ని బట్టి వారి కోసం బహుమానాలు తీసుకెళతాను.
- వారి బంధువుల ఎదుట, నా ఇంటిని ఆమె ఓ స్వర్గంగా మార్చేసిందని, బిడ్డల పెంపకం పట్ల చాలా శ్రద్ధ వహిస్తుందనీ, ఆమెని భార్యగా పొందినందుకు నేను అదృష్టవంతుడని మెచ్చుకుంటాను.
- ఆమె అన్నాతమ్ముళ్ళతో సన్నిహితం పెంచుకుంటాను. మన మధ్య గల సత్సంబంధాల్ని ఇంకా పటిష్టం చెయ్యాలని కృషి చేస్తాను.



**అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ**



# మాన ధనులు

మానం- మనిషిని పాపకార్యాల నుండి కాపాడుతుంది.

మానం- మానవునిలో బాధ్యతను స్వీకరించే గుణాన్ని జనింపజేస్తుంది.

మానం- మనిషి జీవితానికి ఒక ఉన్నత లక్ష్యానిస్తుంది.

మానం- మనిషిని తోటి మానవుల హక్కులను నిర్వర్తించడానికి పోత్సహిస్తుంది.

## మానధనం- జీవితంలో ఆనందాన్ని, తృప్తినిస్తుంది

**మానధనులు:** తమ మనస్సును దుష్టవాంఛలకు బానిసకాకుండా కాపాడుకుంటారు. అనభ్యకతరమైన విషయాలకు, అశ్లీలతకు దూరంగా ఉంటారు. మంచిని, పారిశుధ్యాన్ని పెంపొందించడానికి నిరంతరం శ్రమిస్తారు.

**మానహీనులు:** "స్వీయ ప్రయోజనాలు" ఎక్కడ దెబ్బతింటాయో అని కోర్కెలకు దాసోహమంటారు. అందరూ నడిచే దారిన వెళ్ళటానికి ఇష్టపడతారు.

**మానధనులు:** ఉన్నత ఆశయాలకోసం, ఉత్తమ ఆదర్శాల కోసం జీవిస్తారు. సజ్జనుల సాంగత్యాన్ని ఎన్నుకుంటారు.

**మానహీనులు:** కబుర్లతో కాలం గడుపుతూ, సాకులు చెప్పుతూ తింటూ త్రాగుతూ జీవితాన్ని వెళ్ళిస్తారు.

**మానధనులు:** : చిత్తశుద్ధి కలిగి ఉంటారు. వారు ఎల్లప్పుడూ దైవ ప్రసన్నతను, పరలోక సాఫల్యాన్ని కోరుకుంటారు. ఇతరులు తమ విలువను గుర్తించాలని తమను ఆమోదించాలని ఎన్నడూ ఎదురు చూడరు.

**మానహీనులు:** ఎపుపడూ తమ గుర్తింపు కోసం ప్రాకులాడుతూ ఉంటారు.

**మానధనులు:** వారిలో దృఢ విశ్వాసం, మనో నిబ్బరం, ధైర్యసాహసాలు మెండుగా ఉంటాయి. స్వార్థపరులు, అవకాశవాదులకు వారు సులువుగా లొంగిపోరు. ఎన్నడూ పిరికితనాన్ని ప్రదర్శించరు.

**మానహీనులు:** "బజారులో అమ్ముడుపోయే సరుకు" లాంటి వారు. ఇతరులకు సులువుగా లొంగిపోతారు. అమ్ముడుపోతారు.

**మానధనులు:** వారు ఏమాటైనా సూటిగా, స్పష్టంగా, ఖచ్చితంగా చెబుతారు. కనుక వారికి నిజమైన స్నేహితులుంటారు. కొందరే ఉంటారు.

**మానహీనులు:** మాటలు అర్థం పర్థం లేకుండా ఉంటాయి. వారి ప్రవర్తన కూడా ఒకే తీరు ఉండదు. ముందు వినయాన్ని ప్రదర్శిస్తారు. ఎంతో ఆప్యాయతగా మాట్లాడతారు. వెనుక గోతులు తీస్తుంటారు.

**మానధనులు:** వారిలో అణకువ, వినయ వినమ్రతలుంటాయి. వారు తమకు అన్నీ తెలుసునన్నట్లు ఎన్నడూ ప్రవర్తించరు. తెలియని విషయాలను గురించి తెలుసుకుంటారు. ఎవరినీ కించపరచరు.

**మానహీనులు:** విషయజ్ఞానం లేకపోయినా ఉన్నట్లు తమకు తాము ప్రదర్శిస్తారు. ఎదుటి వ్యక్తిని ఒట్టి వ్యధవగా తలుస్తారు.

**మానధనులు:** వారి యోగ్యతను గుర్తించి వారికి ఏదైనా బాధ్యత అప్పగిస్తే దాన్ని అత్యుత్తమంగా నిర్వర్తించడానికి ప్రయత్నిస్తారు. ఇతరుల అభిప్రాయాలను స్వీకరిస్తారు. విమర్శల్ని భరిస్తారు.

**మానహీనులు:** సాకులు చెప్పి తప్పించుకుంటారు.



**మానధనులు:** మీ యోగ్యతను గుర్తిస్తారు. మీలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటికి తీస్తారు. మిమ్మల్ని ప్రోత్సహిస్తారు. మిమ్మల్ని పొగడ్తారు. మీతో చర్చిస్తారు. మీకు ఉత్తమ సలహాలిస్తారు. మిమ్మల్ని ప్రేమిస్తారు. మిమ్మల్ని విమర్శిస్తారు కూడా.

**మానహీనులు:** ప్రవర్తన దీనికి భిన్నంగా ఉంటుంది. వారు ఆస్తి అంతస్తులను చూసి వ్యక్తులను అంచనా వేస్తారు. ముఖస్తుతిని ఆశ్రయిస్తారు.

**మానధనులు:** దైవం ప్రసాదించిన సంపదను అభాగ్యుల అవసరాలపై ఖర్చుపెడతారు.

**మానహీనులు:** జనుల్ని ఆశ్చర్యపోయేటట్లు చెయ్యటానికి తమ డబ్బును అవసరంలేని వస్తువులపై ఖర్చుపెడతారు.

**మానధనులు:** విశాల హృదయులై ఉంటారు. విమర్శల్ని హుందాగా స్వీకరిస్తారు. ఆత్మపరిశీలన చేసుకుంటారు. తమ తప్పుల్ని ఒప్పుకుంటారు. తమల్ని సంస్కరించుకుంటారు.


**మానహీనులు:** విమర్శల్ని సహించరు. వారికి తొందరగా కోపం వస్తుంది. ఇతరుల్ని నిందిస్తుంటారు. తప్పుల్ని ఎత్తి చూపే వారిని దూరంగానే ఉంచుతారు. అందుకే అంతిమ దైవప్రవక్త(స) వారు ఇలా అన్నారు: "మానం పూర్తిగా ప్రయోజనదాయకమే".

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

# గజ్వయె తబూక్

## (తబూక్ యుద్ధం హిజ్రీ శకం - 9)



**మక్కా** విజయం సత్యం, అసత్యానికి మధ్య ఓ గీటురాయిలా పనిచేసింది. ఈ విజయానంతరం మహాప్రవక్త ముహమ్మద్ (స) గారి సందేశం పట్ల ఏ విధమైనటు వంటి ఆపోహ భ్రమ, అనుమానం అరబ్బుల వద్ద మిగల లేదు. ప్రజలు దైవధర్మంలో తండోప తండాలుగా ప్రవేశింపసాగారు. అయితే అనవసరంగా ముస్లింలతో తగాదాలకి దిగే ఓ శక్తి ఉద్భవించింది. అదే రోమన్ల సైన్యం. ఆ కాలం నాటి అతి పెద్ద సైన్యం గల గొప్ప సామ్రాజ్యం. రోము చక్రవర్తి ఖైసర్ రోము సైనికులు మరియు తనకు అనుకూలంగా వున్న అరబ్బు సిపాయిల సైన్యాన్ని ముస్లింలపై దాడి చేసి అంతమొందించాలని సమీకరించాడు. రోము ఈ సైన్యం గురించి ముస్లిములకు తెలిసింది. ముస్లిములలో ఓ విధమైనటు వంటి భయం, కలత బయలు దేరింది. ఇది గ్రహించిన దైవప్రవక్త (స) దూరదృష్టిని ఉపయోగించి మీనమేషా లెక్కిస్తూ కూర్చోక తక్షణమే యుద్ధం కోసం సన్నద్ధులవ్వండని ఆదేశించారు. అలాగే రోమన్లతో పోరాడటానికి సిద్ధమవ్వండని ఇతర అరబ్బు తెగలను సైతం ప్రోత్సహించారు. అల్లాహ్ మార్గంలో ధన, కనక, వస్తు త్యాగాల కోసం ప్రజలను ప్రేరేపించారు. దైవ ప్రవక్త(స) బోధనతో ఉత్తేజితులైన ప్రజలు భారీ విరాళాలు అందజెయ్యడం ప్రారంభించారు. సైన్యం ముప్పయి వేలకు చేరుకున్నాక, ఆ ముస్లిముల సైన్యాన్ని తీసుకుని యర్మూక్ వైపు బయలుదేరారు. అక్కడ చేరుకుని మకాం వేశారు. ఆ తరువాత అందరిని ఉద్దేశించి హితోపదేశం చేశారు. ఇహంలోనూ పరంలోనూ మంచిని కాంక్షించమని, చెడుల నుండి దూరంగా మసలుకొండని బోధ చేశారు. అటు రోమన్లు ప్రవక్త(స) గారి రాక గురించి తెలుసుకొని భయపడిపోయారు. వారు ముస్లిం యోధులను ఎదుర్కొవడానికి సాహసించలేకపోయారు. వారు తమ హద్దుల్లోనే కోటల్లోనే వుండిపోయారు. ముస్లింలు గొప్ప శక్తిగా రూపొందారన్న దానికి ఇది ఓ తార్కాణం. ఈ విషయాన్ని రోమ్‌కు చుట్టు పక్కల దేశాలు కూడా గ్రహించాయి. అలా యుద్ధం స్థంభవించి వుంటే లభించని అనేక రాజకీయ లాభాలు యుద్ధం జరగకుండానే ప్రాప్తమయ్యాయి. ముస్లిముల సైన్యం విజయకేతనం ఎగురవేస్తూ వీరుల్లా మదీనాకు క్షేమంగా చేరుకున్నారు.

### హజ్రత్ అబూబక్ర్ (ర) గారి హజ్జ్ ప్రయాణం (హిజ్రీ శకం 9 )

మహాప్రవక్త (స.అ) హజ్రత్ అబూబక్ర్(ర) గారిని ప్రతినిధిగా చేసి యాత్రికులతో హజ్జ్ చేయటానికి పంపారు. మక్కా చేరుకున్న తరువాత హజ్రత్ అబూబక్ర్(ర) కొందరు మనుషుల్ని పంపి ప్రజలకు ఈ విషయాలు తెలియజేయండని పురమాయించారు. ఈ సంవత్సరం తరువాత బహుదైవారాధకులు ప్రతిష్ఠాలయ పరిధుల్లో ప్రవేశించి హజ్జ్ నియమాలు పాటించటానికి వీల్లేదు, ఏ ఒక్కరూ నగ్నంగా కాబా ప్రదక్షిణ చేయకూడదు అని వారందరు ప్రజల సమక్షంలో బాహటంగా ప్రకటించారు. ఈ నినాదం ఇక అరేబియాలో విగ్రహారాధనకు కాలం మూడింది అన్నదానికి నాంది పలికింది. అతి వేగంగా ఇస్లాం ప్రసరించడంలో హిజ్రీశకం 9, 10వ సంవత్సరం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ రెండు సంవత్సరాల్లో అతి పెద్ద ఎత్తున జనం మదీనా వచ్చి ఇస్లాం స్వీకరించి, ఇస్లామీయ శిక్షణ పొంది ఆ తరువాత తమ తమ తెగల వారి వద్దకు తిరిగి వెళ్ళేవారు.

అబూ తఫ్‌హీమ్
mujq8@yahoo.co.in



# ఏ గూటి చిలుక ఆ గూటి పలుకు పలుకు



'బేటే వజ్జా! నీ బ్యాగ్‌లో పెన్సిల్ ఏదమ్మా? కనిపించటం లేద'ని వజీర్ తల్లి ఆమినా అడిగింది. 'అది...అది నా క్లాసులో కుబ్రా దగ్గర పెన్సిల్ లేకపోతే ఇచ్చానమ్మా' అన్నాడు 6 సంవత్సరాల వజీర్ కొంచెం భయపడుతూ. 'మేరే లాల్ మేరే ప్యారే అంతే కదా! దానికింత భయమెందుకూ' అని దగ్గర లాక్కుని ముద్దు పెట్టింది. నువ్వు ఆ పాపకు సహాయం చేసినందుకు ఇదిగో నీకొక కొత్త కలర్ పెన్సిల్ బాక్స్ గిఫ్ట్ అని బహూకరించింది.

'మరొకసారి ఎవరికైనా ఇస్తావా చెప్పు ఇస్తావా..' అని షాహిదా తన 7 సంవత్సరాల కొడుకుని బాదుతూ చెబుతుంటే, 'రబ్బరే కదమ్మా ఇచ్చాను ఆమిర్‌కు' అని జావీద్ సమాధానమిచ్చాడు. 'నువ్వు పెద్ద మహారాజ కొడుకువా? రబ్బరే కదా అంటా రబ్బరే!!', 'మహారాజా కొడుకే కాదు నేను కూడా మహారాజునే, నువ్వే కదా అప్పుడప్పుడు నా రాజా , నా కన్నా అంటూ వుంటావు' అని చెప్పంగానే జావీద్ చెంప ఛెళ్ళు మంది..'జోకుల్రా నీకు. ఇంటి సామాన్లన్నీ ఇలాగే తగలేదుస్తూ వుండు. ఇప్పుడే ఆ ఆమిర్ ఇంటికి వెళ్లి రబ్బరు వాపసు తీసుకు రాకపోతే ఇంట్లో అడుగు పెట్టడానికి వీల్లేదు.'

ఇది రెండు తల్లుల భిన్న మనస్తత్వం, పిల్లలకు ఇచ్చే శిక్షణ. ఆమినా లాంటి తల్లులు తక్కువ, షాహిదా లాంటి వారే ఎక్కువ ఉన్నారు నేటి సమాజంలో. ఆర్థిక మాంద్యం నేటి అతి పెద్ద సమస్య. దానికి వడ్డీ అతిపెద్ద కారణమయితే, స్వార్థప్రియత్వం, అత్యాశ, దగా, మోసం, పరస్పర సహకారలేమి మొదలైనవి కూడా దీని వెనకాల వున్నాయి.

షాహిదా లాంటి పెంపకం వల్ల పిల్లలు పెద్దలయ్యాక వారు వ్యాపారస్తులుగా, ఆఫీసర్లుగా, మేనేజర్లుగా అయితే ఆ తల్లి పెంపకం యొక్క ప్రభావం తమ వృత్తిలో కనపరిస్తారు. ఎవరినీ సహాయం చేయకుండా తను మాత్రమే అభివృద్ధి చెందాలనే సూత్రం మీద ఎదుగూ వుంటారు. అంతే కాదు ఏ విధంగా ప్రజల నుండి ఎక్కువ సొమ్ము రాబట్టాలో, ప్రజలను ముంచి తను ఏ విధంగా పైకి రావాలో ప్రయత్నిస్తూ ఉంటారు. కొత్త కొత్త స్కీములు తయారు చేసి ప్రజలను మోసం చేసి వారి సొమ్మును కాజేయాలని చూస్తు వుంటారు.

సొంత తమ్ముడైనా వడ్డీ లేకుండా అరువు ఇవ్వరాదని, అతి జాగ్రత్తే శ్రేయంగా భావిస్తూ వుంటారు.

ఆర్థిక మాంద్యాన్ని పరిష్కరించాలని పెద్ద పెద్ద సెమినార్లు జరుగుతున్నాయి. దివ్యఖుర్‌ఆన్ దీనికి 3 సూత్రాలను తెలియజేసింది.

**1.** **వడ్డీని పూర్తిగా నిర్మూలించాలి.**

**2.** **అమానతులు దానికి అర్హులైన వారికే అప్పగించాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి.**

**3.** **పిసినారితనం, స్వార్థప్రియత్వం, మోసం, దగా లాంటి అవగుణాల్ని విడనాడాలి.**

దివ్యఖుర్‌ఆన్‌లోని ఒక వచనాన్ని చూడండి.

> **"పరలోక శిక్షను, బహుమానాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా? అతడే అనాథలను కసరికొట్టేవాడు, పేదవాళ్ళకు అన్నం పెట్టు అని ప్రోత్సహించనివాడు. పోతే తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహించేవారు, ప్రదర్శనా బుద్ధితో వ్యవహరించేవారు, వాడుకునే మామూలు వస్తువులను (ప్రజలకు) ఇవ్వటానికి వెనుకాడేవారు సర్వనాశనమవుతారు."** (107: 1-7)

సాధారణంగా మనం పిల్లలతో– **'ఒరేయ్ ఒంటరిగా కూర్చుని తిను బయటికి వెళ్ళకు, మీ ఫ్రెండ్స్ వచ్చేటప్పుడు అవి దాచేయవచ్చుకద్రా, వెర్రి వెధవా! మేము వాళ్ళ పని వాళ్ళమా? ఇక నుండి ఏ ఆంటీ చెప్పినా నువ్వు బజారుకు వెళ్ళకు, కాళ్ళు అరక్పోదుతా'.** లాంటివెన్నో చెబుతూ వుంటాం. పిల్లల్ని జాగ్రత్త, పద్ధతి, పొదుపు, వంటివి నేర్పించకూడదు అని కాదు ఉద్దేశ్యం.

కాని షాహిదా లాంటి పెంపకం వల్ల పిల్లలు (ప్రజలు) మరీ స్వార్థ పరులుగా, ప్రజల రక్తాన్ని పీల్చుకు త్రాగే జలగల్లా తయారవు తున్నారు. ప్రవక్త ముహమ్మద్ (స) గారి బోధనలన ఆధారంగా **8** సూత్రాలు మనం పాటిస్తూ, మా పిల్లలను నేర్పిస్తే వారిలో ఉత్తమ గుణాలు జనిస్తాయి.

**1.** మా ఇంటికి బంధువులొస్తున్నారు, వారి పిల్లలతో మీరంతా బాగా ఆడుకోవాలి. వారికి ఏదీ ఇవ్వను అని పేచీ పెట్టకూడదు.

**2.** అగత్యపరులకు, అవసరార్థులకు మన పిల్లల చేత దానం ఇప్పించాలి.

**3.** ఇరుగుపొరుగు వారికి ఏది ఇవ్వదలచినా పిల్లల ద్వారా పంపించాలి.

**4.** పండ్లు స్వీట్లు తెచ్చినప్పుడు ఇరుగుపొరుగు పిల్లలకు ఇవ్వాలి, కుదరకపోతే వాటి తొక్కలు వగైరా కనపడకుండా బయట పారేయాలి.

**5.** వీధిలో పిల్లలందరినీ ఇఫ్తార్ విందుకు ఆహ్వానించాలి, మన పిల్లలే వారికి హుషారుగా వడ్డించే విధంగా చూసుకోవాలి.

**6.** తల్లిదండ్రులైనా, అత్తామామలయినా వారితో మేము ఏ విధంగానైతే వ్యవహరిస్తామో మాతో అదే విధంగా మా పిల్లలు రేపు వ్యవహరిస్తారు. ఇక్కడ నటన పనికి రాదు. సహజమైన స్వభావంతో వ్యవహరించాలి.

**7.** పుచ్చుకునే చెయ్యి కన్నా ఇచ్చే చెయ్యి మిన్న అని పిల్లలకూ నేర్పించాలి.

**8.** వడ్డీ మహాపాపం, వడ్డీ పేదోడి నెత్తురు పీల్చే రక్తపిశాచి, వడ్డీ, లంచం తినేవాడి హృదయంలో దయ ఉండద'ని వారికి తెలియపరచాలి.

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalam@ymail.com



# మొహమాటం మోతాదుకు

**'మాట** అనే ఆయుధంతో మట్టి మనిషి కూడా మహోన్నతుడు కాగలడు' అంటారు పెద్దలు. నిజమే. కాని ఆ మాటకు ముందు మొహం వచ్చి చేరితే ఆ మాటే 'మొహమాటం' అయి మనిషిని కుదుతూనే ఉంటుంది. మాట మనిషిని మహా మనీషిలా మార్చే యంత్రం అయితే, మొహమాటం అనేది చలి చీమలాంటిది. కాటువేసినప్పుడల్లా విపరీతమైన మంటగా ఉంటుంది. ప్రాణం పోదు కానీ ఆ మంట ప్రాణం తోడేస్తుంది. ఇది రోజూ ఏదో ఒక టైమ్‌లో కుదుతూనే ఉంటుంది. మొహమాటస్తులు లేనిపోని బాధ్యతల భారాన్ని తమపై వేసుకుని నిరంతరం బాధపడుతూనే ఉంటారు. ఒకరికి సహాయపడాలనే ఆలోచన సరైనదే... అది ఇప్పటి సమాజంలో చాలా అవసరం కూడా. అయితే వీలుకానప్పుడు కాదనడం కూడా ఒక కళే అని గ్రహించాలి.

అప్పు అడిగినవారిని గట్టిగా లేదని చెప్పలేకపోవడం, ఇచ్చేశాక బాధపడటం, తిరిగి వసూలు చేసుకోవడానికి అదేదో పరాయి సొమ్ము అన్నట్టు మొహమాటపడటం, మన వద్ద చేయాల్సిన పని బోలెడంత ఉన్నా ఎవరైనా వచ్చి ఇక్కడికెళదాం, అక్కడికి వెళదాం అంటే మొహమాటానికి పోయి రాజీపడటం, ఆనక దుఃఖించడం, మనల్ని ఎవరైనా డామినేట్ చేసినప్పుడు ప్రతిఘటించలేక పోవడం ఇవన్నీ మొహమాటపు పరిణామాలు. ఒక రకంగా చెప్పాలంటే మొహమాటం అభద్రతాభావానికి మరో పరిణామం. ఇది ఎందుకు కలుగుతుంది అంటే - ఎవరైనా మన గురించి చెడుగా అనుకుంటారేమో అన్న ఆత్మనూన్యత భావమే మనల్ని మొహమాటానికి గురి చేస్తుంది. 'ప్రపంచంలో అందరి చేతా మంచి అన్పించు కోవటం అసాధ్యం' అనే చిన్న సూత్రాన్ని మర్చి పోవడం వల్ల వచ్చే జబ్బు మొహమాటం.

మొహమాటం కారణంగా అవతలివారి కోసం ఏదో ఒక పని చేసి, తర్వాత తీరిగ్గా కూర్చొని బాధపడటం మనందరికీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవం అయ్యే ఉంటుంది. పోతే మనలో కొందరు మొహమాటానికి 'మంచితనం' అన్న నిర్వచనం ఇచ్చుకొని తెగ సంబర పడి పోతుంటారు. 'నో' అని గట్టిగా చెప్పగలిగే స్థితిలో ఉండి కూడా అవతలివారికి మంచి చేయాలన్న ఉద్దేశ్యంతో చెప్పకపోతే అదో పద్ధతి. మనం చేసిన పని అవతలివాళ్ళకి లాభం కలిగించేదైతే, అప్పుడు అది మన మంచితనం అవుతుంది. అలా కాని ఎడల 'మన చేతగానితనానికి వేసుకున్న ముసుగు అది' అని తెలుసుకోవాలి. ఎందుకంటే- ఒక్కోసారి ఇది దారుణమైన పరిణామాలకి కూడా దారి తీయచ్చు. ఉదాహరణకు: 'స్త్రీలలో మొహమాటం ఎక్కువ' అన్నది అందరికీ తెలిసిన విషయమే. అందులో పెళ్లికాని ఆడపడుచులకు మరీను. ఓ వ్యక్తి వయసులో తనకన్నా పెద్దవాడైనా, చిన్నవాడైనా లేదా సమవయస్కుడైనా తనని ముట్టుకుంటున్నాడు, బుగ్గలు గిల్లుతున్నాడు, అశ్లీలత నిండిన జోక్స్ వేస్తున్నాడు - స్త్రీగా ఆమెకు ఇబ్బందిగానే ఉంటుంది. కానీ మొహమాటానికి పోయి లేనిపోని ఇక్కట్లు కొనితెచ్చుకుంటుంది. స్త్రీలలో ఉన్న ఈ బలహీనత తెలిసిన ఆ పరమ శ్రేయోభిలాషి వారినిలా హితవు చేస్తున్నాడు:

**"మీరు అల్లాహ్‌కు భయపడేవారైతే (పర పురుషులతో మాట్లాడేటప్పుడు) మెతకదనం (మొహమాటం) కనబడేలా మెల్లిగా మాట్లాడకండి. అంతర్యంలో 'చెడు' (ఉద్దేశ్యం, కామం) ఉన్నవాడ్ని ఈ (మొహమాటం) మెతకదనం పేరాశకు పురిగోల్పే ప్రమాదం ఉంటుంది. అందువల్ల (సూటిగా) స్పష్టంగా, కరాఖండిగా మాట్లాడండి." (అహ్‌జాబ్: 32)**

ఇక పురుషుల విషయానికొస్తే....పిచ్చాపాటి మాట్లాడుతూ ఒక్కసారిగా టాపిక్ మార్చి అసభ్యకరమైన కూతలు మొదలెడతారు. కొందరికి వారి ఈ వైఖరి నచ్చకపోయినా, ఇబ్బందిగా ఫీలవుతూనే అక్కడే అంటిబెట్టుకుని ఉంటారు. కారణం - లేచివెళితే స్నేహం ఎక్కడ పాడవుతుందోనన్న మొహమాటం (భయం?). అటువంటి వ్యక్తులకు దేవుడిచ్చే సలహా:

**"ప్రజలు మా సూక్తుల గురించి కువిమర్శలు చేస్తూ అపహాస్యం చేస్తుంటే నీవు వారి దగ్గర కూర్చోకు. అక్కడ్నుంచి లేచి వెళ్ళిపో. వారా విషయం మానేసి మరో విషయం మాట్లాడు కునేదాక వారి చెంతకు వెళ్ళకు. ఎప్పుడైనా షైతాన్ నిన్ను మరిపింపజేస్తే జ్ఞాపకం వచ్చిన వెంటనే అలాంటి దుర్మార్గుల దగ్గర నుంచి లేచివెళ్ళిపో. (మా ఈ ఆదేశాన్ని విస్మరించి) మీరు కూడా వారితోపాటు కూర్చుంటే అప్పుడు మీరు కూడా వారి మాదిరిగానే అయిపోతారు.. అయితే హితోపదేశం మాత్రం చేస్తూనే ఉండాలి. బహుశా వారు వీటన్నింటిని విడనాడి గొప్ప దైవభీతిపరులు కావచ్చు".**

(అన్‌ఆమ్: 68,69)

ఇక మొహమాటానికి పోయి చెడును చూస్తూ కూడా గుడ్డిగా సమర్థిస్తూ అరికట్టకపోతే అలాంటివారు దైవ శిక్షకు అర్హులు అవుతారు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: **"ఇస్రాయీల్ సంతతిలో సత్యాన్ని తిరస్కరించినవారు దావూద్ నోట, మర్యం కుమారుడు ఈసా నోట శపించబడ్డారు. దానికి కారణం వారు అవిధేయులై హద్దులు మీరి ప్రవర్తిస్తూ ఉండటమే. అదీ కాక వారు ఒకర్నొకరు చెడుల నుండి వారించుకునేవారు కాదు. వారు చేసింది చాలా చెడ్డ పని అనడంలో ఎలాంటి సందేహం లేదు". (మాయిదా: 78,79)**

అంటే వారు చేసిన నేరాల్లో ఓనేరం చెడుని చెడు అని చెప్పకపోవడం, ఆపకపోవడం అని తెలుస్తుంది.

ఇక ఇటువంటి మాటలకు చేష్టలకు పాల్పడే వారంటారా? వారి కోసం దుర్భర యాతన ఎదురు చూస్తుంది. **"విశ్వాసులలో అశ్లీల విషయాలు వ్యాపించాలని కోరుకునేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ వ్యథా భరితమైన శిక్షకు అర్హులవుతారు. (సమాజం మీద అశ్లీలం ఎంత దుష్ప్రభావం వేస్తుందో) అల్లాహ్‌కు మాత్రమే తెలును. మీకు తెలియదు". (నూర్:19)**

నిస్వార్థంగా జీవిస్తున్నామనీ, అవతలివాళ్ళని బాధపెట్టడం లేదని రాజీ పడే మనిషి ఇతరుల కోసం తనని తాను కోల్పోతాడు. తన బలహీనతల్ని ఆత్మవంచనతో సమర్థించుకుంటాడు. ఇతరుల కోసం రాజీ పడి బ్రతికే మనిషి రానురాను మానసికంగా కృంగిపోతాడు. ఈ మార్పు అతనిలో ఆలోచనా విధానాన్ని దెబ్బతీస్తుంది. ఒక విధమైన సెల్ఫ్ పిటీని (విరక్తి) తనమీద తనకే కలుగుతుంది. తెలివితేటలు, వ్యవహార జ్ఞానం మనిషి ముందుకి నడిపిస్తుంటే, ఈ రకమైన ఆత్మనింద వెనక్కి తోస్తుంది.

# మించితే....



ప్రవక్త (స) వలీమా విందు సందర్భంగా ఆహ్వానితులు విందు ఆరగించిన వెంటనే వెళ్ళిపోకుండా అక్కడే పంచాయితీ పెట్టి లోకాభి రామాయణంలో మునిగిపోయారు. వారు ఎంత సేపటికీ కదలనందుకు దైవప్రవక్త (స) వాళ్ళను వెళ్ళమని చెప్పలేక సతమతమయ్యారు. అప్పుడు స్వయంగా ఆ పరమోన్నత ప్రభువు కలుగ జేసుకుని ఈ ఆజ్ఞను జారీ చేశాడు.

**"విశ్వాసులారా! అనుమతిలేకుండా దైవ ప్రవక్త (స) ఇండ్లలోకి దూరకండి. భోజన సమయంలో (అనవసరంగా) అక్కడ తార్లాడుతూ ఉండకండి. ఒకవేళ మిమ్మల్ని భోజనానికి పిలిస్తే నిరభ్యంతరంగా వెళ్ళ వచ్చు. అయితే భోజనం చేయగానే అక్కడ్నుంచి లేచి వెళ్ళండి. అంతేగానీ ఖబుర్లు చెప్పుకుంటూ అక్కడే కూర్చోకండి. అతను (ప్రవక్త) బిడియం, మొహమాటం వల్ల మిమ్మల్ని ఏమి అనలేడు. మరి అల్లాహ్ యదార్థం చెప్పడానికి ఏ మాత్రం మొహమాటపడడు". (అహ్‌జాబ్: 53)**

ఇందులో ఆలోచించేవారికి చాలా చక్కటి హితబోధ ఉంది. ఒకరి ఇంటికి వెళ్ళేటప్పుడు పాటించాల్సిన మర్యాదలతోపాటు మొహమాటం, బిడియం ఉన్న వ్యక్తుల్ని మరింత ఇబ్బందికి గురి చేయకూడదని చెప్పబడింది. ఆయన (స) ప్రవక్త గనక ప్రభువు సమస్యను పరిష్కరించాడు. మన సమస్యల్ని మాత్రం మనమే పరిష్కరించుకోవాలి. ఎందుకంటే-మన మొహమాటం వల్ల మనం అవతలివాళ్ళ పనులు చేస్తూపోతే కొంతకాలానికి వాళ్ళు మన మంచితనాన్ని చేతగానితనంగా భావిస్తారు. మన మీద అధికారం సంపాదించుకున్నట్టు ఫీలవుతారు. ఇలాంటి మొహమాటం వల్ల చివరికి మనిషి అసమర్థ స్థాయికి చేరు కుంటాడు. అలా తానో జీవచ్ఛవంలా బ్రతకడం మాత్రమే తనకి మిగులుతుంది. ఈ లోకంలో సనువిస్తే మన నెత్తినెక్కి సూక్ష్మ జీవులలాగా బ్రతకడానికి ఎంతో మంది రెడీగా ఉంటారు. కాబట్టి మనకేం కావాలో, మనకేది సాధ్య మవుతుందో కరెక్ట్‌గా తెలుసుకోగలిగి ఉండాలి. పరుల కోసం ఎన్నో పనులు చేసిన ఎందరో తమసొంత భార్యాపిల్లల్ని నిర్లక్ష్యం చేయడం మనం గమనిస్తూనే ఉంటాం. అందరితో మంచి అన్పించుకోవాలన్న కోరికే దీనికి పునాది. అందుకే "నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడే ధన్యుడు" అన్న సుమతీ శతకం ఇక్కడ కరెక్ట్‌గా సూటవుతుంది.

ఎలా అంటారా? ఏదన్నా పని మన వల్ల కాదు అని చెప్పడం వల్ల అవతలి వ్యక్తికి మన మీద దురభిప్రాయం కలుగదు. అదే చేస్తానని చెప్పి తర్వాత మాట తప్పడం ద్వారా విశ్వాసాన్ని కోల్పోతాం. పైగా అలాంటి మాటలు అవతలి వాళ్ళకి లేనిపోని ఆశలు కలిగిస్తాయి. మొదటి సారి కాదనటం వల్ల కలిగే నిరాశకన్నా - చేస్తానని చెప్పి, చెయ్యలేకపోవడం వల్ల అవతలి వ్యక్తికి కలిగే ఆశాభంగం మన మీద ఆ వ్యక్తికి ఎక్కువ ద్వేషాన్ని కలిగిస్తుంది. కాబట్టి నేటి నుండి అమర్యాద లేకుండా 'నో' అని చెప్పడం అలవర్చుకోండి. మీరు ఎందుకు 'నో' అంటున్నారో వివరాలు ఇవ్వద్దు. 'నో' అని చెప్పడం వేరు. మన అశక్తతని వివరించి సానుభూతి ఆశించడం లేదు.

ఇకపోతే - ఈ మొహమాటం అనేది ఒక్కో క్కప్పుడు కాస్త గారాబంగా కూడా మారుతుంది అంటే కొందరికి నమ్మబుద్ధి కాదు. పిల్లలు ఏది అడిగినా కాదనకపోవడం, వాళ్ళు ఏది కావాలంటే అది కొనివ్వడం, అశ్లీల సాహిత్యం చదివినా, సినిమాలు చూసినా, తుంటరి చేష్టలు చేసినా, మద్యం సేవించినా, మట్కా ఆడినా, జులాయిగా తిరిగినా, మహల్లాలోని మహిళల్ని వేధించినా - 'మా కాలంలో మేమేమీ అనుభ వించలేదు కదా, కనీసం మన పిల్లలన్నా అనుభవించని' అని సమర్థించే ఆదర్శ తల్లిదండ్రులు కూడా కొందరుంటారు. ఈ వైఖరి దేశం అవతల పరదేశాల్లో, గల్ఫ్‌లో పని చేసే తల్లిదండ్రుల వద్ద ఎక్కువే అనడం అతిశయోక్తి కాదు. ఇవన్నీ మొహమాటం క్రిందికే వస్తాయి. నిక్కచ్చిగా - కాదు/లేదు అని చెప్పలేకపోవడం తల్లిదండ్రులుగా మన బలహీనత. కనీసం మన పిల్లలక్కూడా అలా చెప్పలేకపోవడం వాళ్ళకు మేలు చేస్తున్నట్లు కాదు. వీలైనంత హాని చేస్తున్నట్లే లెఖ్క. కాబట్టి మొహమాటస్తులయిన వారందరికీ గగన యాత్ర (మేరాజ్) సందర్భాన దైవప్రవక్త (స) వారు చూసిన దృశ్యం కనివిప్పు కావాలి.

మేరాజ్ సందర్భాన దైవ ప్రవక్త (స) వారికి ఒక వ్యక్తి కానవచ్చాడు. వాడు కట్టెలు పోగు చేసి ఎత్తుకునేందుకు తిప్పలు పడుతున్నాడు. కానీ ఆ కట్టెల మోపు లేవకపోవడంతో (కట్టెలు తగ్గించే బదులు) మరిన్ని కట్టెలు వేసుకుని ఎత్తుకోబోతున్నాడు. 'ఎవరీ మూర్ఖుడు?' అని దైవ ప్రవక్త (స) అడగ్గా, **"వాడు అదుపూ అపూ లేకుండా (మొహమాటం కొద్దీ) అదే పనిగా తనపై బరువు బాధ్యతలను వేసుకునేవాడు. (లేదా మితి మీరిన ఆత్మ విశ్వాసంతో అక్షల భారాన్ని పెంచుకునేవాడు) కాని వాటిని నెరవేర్చలేకపోయేవాడు. అయినప్పటికీ (బుద్ధి తెచ్చుకొని) ఆ బరవు బాధ్యతలను తగ్గించుకునే బదులు మరిన్ని బాధ్యతలను తన నెత్తిన వేసుకునేవాడు"** అని చెప్పబడింది.

అంటే కాదని చెప్పడానికి ఇబ్బంది పడే వారికన్నా, అవునందుకు బాధపడేవాళ్ళే ఎక్కువ. కాబట్టి సోదరులారా! నిజంగా కష్టంలో ఉన్న వ్యక్తిని ఆదుకోవడం మనసుకి ఏనలేని సంతృప్తిని ఆనందాన్ని కలిగిస్తుంది. అయితే అలా ఆదుకోవడం అనేది మన సామర్థ్యం వల్ల అయి ఉండాలే తప్ప మొహమాటం వల్ల కాకూడదు. ఎందుకంటే రెండవదాని వల్ల మనకు ఇబ్బందే తప్ప సంతృప్తి లేదు, ఉండదు.

హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్





# ఆచ్ఛాదన (సతర్)

మొత్తం శరీరానికి, ముఖ్యంగా మర్మావయవాలకు ఆచ్ఛాదనం ఉండటం తప్పనిసరి (వాజిబ్) అన్న విషయం బుద్ధిమంతుడైన ప్రతి మనిషీ ఒప్పుకుంటాడు. శరీరానికి ఆచ్ఛాదనం లేకపోతే మనిషికి గొడ్డుకీ మధ్య తేడా ఏముంటుంది?!

మనిషి ఎల్లప్పుడు తన శరీరాన్ని కప్పుకుని ఉండాలని దేవుడు వస్త్రాలను పుట్టించాడు. ఆయన ఇలా సెలవిచ్చాడు:

**"ఆదం సంతానమా! మేము మీపై దుస్తులను అవతరింపజేశాము. అవి మీరు సిగ్గుపడే మీ శరీర భాగాలను కప్పుతాయి. మీ శరీర శోభకు సాధనంగా ఉంటాయి."** (ఖుర్ఆన్ 7:26)

ఆరాధనా సమయాల్లోనయితే ఈ వస్త్రధారణ ఇంకా అవశ్యమయిపోతుంది. దేవుడు ఇలా సెలవిస్తున్నాడు:

**"ఆదం సంతానమా! ప్రతి ఆరాధనా సమయంలో మీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి."** (ఖుర్ఆన్ 7:31)

## ఆచ్ఛాదనమంటే మర్మావయవాలకు కప్పుకోవటం

నమాజ్ చేసేటప్పుడు స్త్రీ పురుషులిద్దరూ తప్పనిసరిగా తమ మర్మావయవాలను కప్పి ఉంచాలన్న విషయమై "అయిమ్మయె సలఫ్" (సంప్రదాయ విద్వాంసులందరూ) ఏకాభిప్రాయాన్ని కలిగి వున్నారు. (బిదాయతుల్ ముజ్తహిద్)

## మర్మభాగాల (సతర్) గురించి

1. పురుషుని శరీరంలో నాభి నుండి తొడల వరకు భాగాన్ని మర్మావయవాలుగా పరిగణించటం జరుగుతుంది.

(అబూదావూద్, అహ్మద్)

అంచేత నమాజ్ చేసేటప్పుడు కనీసం ఆ శరీరభాగాన్ని కప్పి ఉంచటం పురుషులకు విధి. లేకపోతే నమాజ్ నెరవేరదు.

2. స్త్రీ చేతులు, మొహం తప్ప ఆమె శరీరం మొత్తం సతర్ (మర్మభాగం) క్రిందికే వస్తుంది.

స్త్రీ నమాజ్ చేసేటప్పుడు తల మీద దుప్పటిగాని, మందంగా ఉండే వోణి గాని కప్పుకోవాలి. కాళ్ళు సయితం బయటికి కనపడకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే స్త్రీ నమాజ్ చేసేటప్పుడు ఆమె ముహం, అరచేతులు మినహా మొత్తం శరీరాన్ని కప్పి ఉంచటం విధి. స్త్రీ తొడుక్కునే కమీజు కాళ్ళను కప్పే విధంగా ఉండాలని దైవప్రవక్త (స) ఆదేశించారు. (అబూ దావూద్)

ఆయన ఇంకా ఇలా అన్నారు. తలపై వోణి ధరించని వయోజనురాలి నమాజ్ నెరవేరదు. (అహ్మద్, అబూ దావూద్)

పురుషుడు ఒకే అంగ వస్త్రంతో నమాజ్ చేయగలడు. అయితే ఆ సమయంలో భుజాలు కప్పబడి ఉండాలన్నది నియమం. (బుఖారి-ముస్లిం)

## నమాజ్ చేస్తున్నప్పుడు మొహం మీద గుడ్డ కప్పుకోరాదు.

నమాజ్ చేస్తున్నప్పుడు మొహం మీ గుడ్డ కప్పుకోవటాన్ని, సదల్ చేయటాన్ని దైవప్రవక్త(స) వారించారు. (తిర్మిజీ)

## సదల్ (వేలాడదీయటం)

నమాజ్ చేస్తున్నప్పుడు అంగవస్త్రపు రెండు చివరల్ని కలిపి ముడి వేయకుండా భుజాల మీద వ్రేలాడదీసుకోవటాన్ని 'సదల్' అని అంటారు.

ఎవరైనా తన షరాయిని గాని, లుంగీని గాని మడమల లేక చీల మండల కన్నా క్రిందికి వ్రేలాడదీసి నమాజ్ చేస్తే అతని నమాజ్‌ను దేవుడు స్వీకరించడు. (అబూ దావూద్) ■

షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి




● ముస్లిములు అబిసీనియాలో సుఖ సంతోషాలతో జీవించగలిగారా ?

జ: అవును. వారు అక్కడ చాలా సంతోషంగా ఉన్నారు.

● అబిసీనియాకు రెండవ హిజ్రత్ ఎప్పుడు జరిగింది. ?

జ: అదే సంవత్సరం అనగా దైవ దౌత్యపు నాలుగవ సంవత్సరం.

● అబిసీనియాకు వలసపోయే ఈ రెండో జట్టులో ఎంతమంది ఉన్నారు?

జ: 83 మగవారు. 18 మహిళలు.

● ఈ జట్టులో ముస్లిముల నాయకులు ఎవరు?

జ: జాఫర్ బిన్ అబీ తాలిబ్ (ర).

● వారి గురించి ఖురైషులు ఏమి చేశారు?

జ: ఖురైషులు వారిని తిరిగి తీసుకురావాలని ప్లాన్ చేసి అమ్ర్ బిన్ ఆస్ మరియు అబ్దుల్లాహ్ బిన్ రబీలను (అప్పటికి వారు ఇస్లాం సీకరించలేదు) ఎన్నుకుని నజాషీ రాజు కోసం బహుమతులు ఇచ్చి పంపారు.

● వారిద్దరు అబిసీనియా రాజు నజాషీతో ఏమన్నారు?

జ: వారిద్దరూ అక్కడికి చేరుకుని అతనికి బహుమతులు సమర్పిస్తూ: "ఓ రాజా! మీ దేశంలో మాకు చెందిన కొందరు అవివేకులైన యువకులు వారి తాత ముత్తాతల ధర్మాన్ని విడిచిపెట్టి ఓ కొత్త ధర్మాన్ని సృష్టించుకున్నారు. ఆ ధర్మాన్ని మేము గాని మీరు గాని ఎరుగము. అంచేత వారి తల్లి దండ్రులు, వీళ్ళను తీసుకు రమ్మని మమ్మల్ని పంపారు" అని ప్రాధేయపడ్డారు.

● వారిద్దరి మాటలు విని నజాషీ చక్రవర్తి ఏమన్నాడు?


జ: నజాషీ చక్రవర్తి వారిద్దరి మాటలు విని ముస్లిములతో "మీరు ఇక్కడికి రావడానికి కారణమైన ఆ మతం గురించి వివరించండి" అని అన్నాడు.

● చక్రవర్తి అడిగిన ప్రశ్నకు జాఫర్ బిన్ అబీ తాలిబ్ ఏం సమాధానమిచ్చారు?

జ: రాజా! ఇస్లాం ధర్మం మానవులకు ఏకైక దేవుడైన అల్లాహ్‌ను విశ్వసించాలనీ, ఆయన్నే ఆరాధించాలనీ, ఆయన తప్ప ఎవరినీ ఆరాధించకూడదనీ, సత్యం పలకాలనీ, అమానతులు అప్పజెప్పాలనీ, సంబంధాలు పెంపొందించాలనీ, పొరుగువారితో మంచిగా ఉండాలనీ, వ్యభిచారం చేయకూడదనీ బోధిస్తుంది. మరియు అసత్యం పలకకూడదనీ, అనాథల ఆస్తుల్ని కాజేయడం, శీలవంతులైన మహిళలపై అపనిందలు మోపడం లాంటి కార్యాల నుండి మమ్మల్ని వారిస్తుంది. నమాజు చేయాలని ఉపవాసం పాటించాలనీ, జకాత్ చెల్లించాలని మొదలగు పుణ్యకార్యాల గురించి ఆజ్ఞాపిస్తుంది.

## మానవతా మూర్తితో ముఖాముఖి

శాంతి ప్రియ



★ మీ స్వభావం?

★ స్వార్థం అంటే తెలియదు నాకు
అది నా అభిమతం కాదు గనుక.
నిస్వార్థం అంటే తెలుసు నాకు
అది నా జీవన దృక్పథం గనుక.
నిజాయితీ అంటే తెలుసు నాకు
అది నా జీవితాశయం గనుక.
నీతి అంటే తెలుసు నాకు
నీతిగా బ్రతకడం నా ధ్యేయం గనుక.
సానుభూతి అంటే తెలుసు నాకు
తోటి మానవుల్ని దైవకుటుంబీకులుగా తలుస్తాను గనుక,
చేతనైన సహాయం చేస్తాను గనుక.
అనుభూతి అంటే తెలుసు నాకు
ఉన్నదానిలో తృప్తిగా బ్రతుకుతాను గనుక.
ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తెలుసు నాకు
మాట తప్పడం నా చేత కాదు గనుక.
భోగభాగ్యాలంటే తెలియదు నాకు
అవి కొందరి వారసత్వాలు గనుక.
అందుకే-
అత్యాశ పెంచుకుని జీవించను
అసూయతో కుంటుతూ - కుళ్ళుకుంటూ నడవను
ఉన్నదానితో తృప్తిపడి
ఉత్సాహంగా ఉల్లాసంగా బ్రతుకుతాను.

మిగతా వచ్చే సంచికలో

# ఇస్లాం నిర్దిష్ట వాగ్మూలం

- ఆయిషా (ఉమా మహేశ్వరి)

ఇస్లాం వ్యాపింపజేయడానికి కారణం కరవాల బలం కాదు. ప్రవక్త అందజేసిన సత్య సందేశం వల్లనే ఇస్లాం వ్యాప్తిజెందింది. జీవితంలోని చేదు అనుభవాలు, సంఘటనలు అంతరంగంలోని మానవత్వన్ని జాగృతం చేయటానికి కారణభూతమౌతాయి. కాని మనిషిలోని ఆత్మ సజీవమై ఉంటేనే అది సంభవం. ప్రవక్త ముహమ్మద్(స) విశ్వాసి మరియు తిరస్కారికి తేడా ఎంత చక్కగా విశదీకరించారో చూడండి. విశ్వాసి ఒక ప్రేవు పట్టేంత పాలు త్రాగుతాడు. తిరస్కారి ఏడు ప్రేవులు పట్టేంత పాలు త్రాగుతాడు.

అంటే తిరస్కారి ప్రాపంచిక వాంఛ లాలస కారణంగా అన్న పానీయాల విషయంలో అత్యాశ చూపుతాడు. విశ్వాసి తన మానసిక వికాశం కారణంగా అన్నపానీయాల విషయంలో సమతుల్యాన్ని పాటిస్తాడు. ధర్మం విషయంలో మీతో సహకరించని వారి పట్ల మంచిగా ప్రవర్తించడం ఇస్లాం ఇష్టపడుతుంది. అంటే బహుదైవారాధకుల పట్ల ఆదరణ చూపించడం తప్పు కాదు. అల్పబుద్ధి సంకుచిత మనస్కుడు తనకు మర్యాదగా ప్రజలు లేచి నిలబడాలని కోరుకుంటాడు. ఉత్తముడు దీనికి భిన్నంగా ఆలోచిస్తాడు.

లజ్జ, బిడియంలో ఉన్నత నైతిక ప్రామాణం దాగి ఉంది. ఈ లక్షణాలు స్త్రీలకు ఆభరణం లాంటివి, పురుషులకు ఇది వారి యొక్క మానాభిమానాలను రక్షిస్తుంది. ఉత్తములు ఎక్కడున్నా ఇతరులకు రుచించని విషయాలను రచించరు. కారుణ్యం, ఉదాత్త భావనలు, సత్కార్యాల్లో నిమగ్నమవడం, ఖుర్ఆన్ పఠనం ఇవి అన్నీ మంచి ఫలితానిస్తాయి.

లజ్జ, బిడియంలో ఉన్నత నైతిక ప్రామాణం దాగి ఉంది. ఈ లక్షణాలు స్త్రీలకు ఆభరణం లాంటివి, పురుషులకు ఇది వారి యొక్క మానాభిమానాలను రక్షిస్తుంది. ఉత్తములు ఎక్కడున్నా ఇతరులకు రుచించని విషయాలను రచించరు. కారుణ్యం, ఉదాత్త భావనలు, సత్కార్యాల్లో నిమగ్నమవడం, ఖుర్ఆన్ పఠనం ఇవి అన్నీ మంచి ఫలితానిస్తాయి.

ప్రజలు ధనాన్ని తమ స్వలాభాపేక్ష కొరకు ఖర్చు చేస్తే నిష్ప్రయోజనం. దైవ మార్గంలో ఖర్చు చేసే ప్రతి పైసా పరలోకంలో తమ కోసం కూడబెట్టుకున్నట్లే. దానం వల్ల వస్తుసామగ్రి తరిగిపోదు. దానగుణం ఉదారబుద్ధి, వినయం వినమ్రత గల వాని గౌరవాన్ని దేవుడు ఉన్నతం చేస్తాడు.

అశ్లీల సంభాషణ, నైతిక సంస్కారానికి విరుద్ధం, వీటికి దూరంగానే ఉండటం ఉత్తముల లక్షణం. దైవం మీద దృఢ సంకల్పం భరోసా స్థైర్యానికి ఉన్నతమైన ఉదాహరణ. ఇలాంటి వారు తమ ప్రాణ శత్రువు మీద కూడా ప్రతీకారం తీర్చుకోరు.

భోజనంలో దోషాలు ఎంచడమంటే దేవుని ప్రసాదాన్ని అగౌరవపరచడమే. దోషాలు ఎంచడం కన్నా ఇష్టం లేని పదార్థాలను వదలి వేయడం ఉత్తమం.

మనిషి తమ వారికోసం, ఇతరుల కోసం చేసే సేవ వల్ల అతని స్థానం తగ్గదు. ఇంకా పెరుగుతుంది. అంతరంగంలో పెద్దరికపు భావనగల వారికి అది లజ్జాకరంగా వుంటుంది. మానవుని చివరి కోరిక దైవాన్ని కలుసుకునేదిగా వుండాలి.

(పీస్ హైదరాబాద్ తరువాయి భాగం)

## ముస్లింల మాన మర్యాదలకు, పరువు ప్రతిష్ఠలకు హామి

మానవ మర్యాదలు, పరువు ప్రతిష్ఠలు స్వాతంత్ర్యంలో ఒక ముఖ్యభాగం. ప్రపంచం మొత్తం ఈ వాస్తవాన్ని గుర్తిస్తుంది. ఈ నేపథ్యంలో ముస్లింలు కోరుతున్నదేమిటంటే, ఎప్పుడైనా ఏ వ్యక్తిపైనైనా తీవ్రవాద కార్యకలాపాలకు సంబంధించి అపనింద మోపటం జరిగి, ఆ తర్వాత న్యాయస్థానం అతన్ని నిర్దోషిగా ఖరారు చేసినట్లయితే అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం-

(1) తీవ్రవాదానికి సమబంధించి తప్పుడు కేసు పెట్టడం మూలంగా తన పరువు ప్రతిష్ఠలకు కలిగిన భంగానికిగాను బాధిత వ్యక్తికి నెలలోగా తగిన నగదు పరిహారం చెల్లించాలి.

(2) ప్రభుత్వం/ పోలీసుల తప్పుడు చర్యల బారిన పడ్డ వ్యక్తి మనసుకు కలిగిన గాయం మానిపోయేలా క్రియాశీలక చర్యలు చేపట్టాలి.

(3) అలాంటి వ్యక్తికి రాష్ట్రప్రభుత్వం తరఫున గౌరవప్రదమైన సర్టిఫికెట్ జారీచేయాలి. సదరు వ్యక్తి ఒక గౌరవ పౌరుడు అని చెప్పి అందులో పేర్కొనాలి. అతని గురించి స్పష్టమైన సాక్ష్యాధారాలు లభ్యం కానంతవరకూ అతన్ని మాటిమాటికీ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించకూడదు.

(4) అలాంటి వ్యక్తికి లేదా అతని కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం ఇప్పించాలి.

(5) ఒక వ్యక్తి తీవ్రవాద నేరానికి పాల్పడ్డాడని చట్టబద్ధంగా నిరూపణ అయ్యేదాకా పోలీసుల తరఫునగాని, మీడియా తరఫునగాని అతన్ని తీవ్రవాదిగా పేర్కొనకూడదు. ఈ పద్ధతిని ఉల్లంఘించేవారిని శిక్షించాలి.

## అవస్థాపనా డిమాండ్లు

ప్రభుత్వరంగ సంస్థల్లో ముస్లిం ఉద్యోగుల శాతం చాలా తక్కువగా ఉంది. అందులోనూ ఎక్కువమంది ముస్లింలు అంతగా ప్రాముఖ్యం లేనటువంటి పదవుల్లో నియమించబడ్డారు. ముస్లిం వర్గాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే ఈ విధానాన్ని అవలంబించటం జరిగింది. ఇది అందరికీ తెలిసిన వాస్తవం. అణగారిన వర్గాలకు సంబంధించిన డి.సుబ్రమణ్యం కమీషన్ సయితం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ముస్లింలు కోరేదేమిటంటే:

(1) అణగారిన వర్గాల ప్రత్యేక కాంపొనెంట్ ప్లాన్‌లో ముస్లింలకు కూడా చోటు కల్పించాలి. దానికోసం రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

(2) ప్రతి ప్రభుత్వ విభాగంలో కీలకమైన, కీలకం కానటువంటి పదవులను వేరుచేస్తూ వాటిలో ముస్లింల నియామకాలకు సంబంధించిన వివరాలను ప్రకటించాలి. ముస్లింలకు వారి జనాభా ప్రాతిపదికన కీలకమైన, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని పదవుల్లోనూ నియామకాలు జరపాలి.

(3) వక్ఫ్ ఆస్తులను రక్షించాలి. వాటి దురాక్రమణలమత నిలువరించాలి. వక్ఫ్ ఆస్తులను నాశనం చేసే విధానాలను అడ్డుకోవాలి. వీటికోసం ఒక క్రియాశీల ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

(4) మొత్తం రాష్ట్రంలో ఉర్దూను, రెండవ అధికార భాషగా కాకుండా సహాయ అధికార భాషగా ఖరారు చేస్తున్నట్లు ప్రకటించాలి.



# హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) 8

**ప్రవక్త కుటుంబీకులు**

హజ్రత్ అయిషా(ర) ఒక ఉల్లేఖనంలో: ఫాతిమా(ర), భర్త అలీ(ర), వారి కుమారులు హసన్ హుసైన్‌లను ప్రవక్త(స) గారు తమ ఇంటి సదస్యులుగా చేర్చుకున్నార' ని ఉంది. "అహ్‌లుల్ బైత్" అరబీ పదము. అహల్ అనగా అయినవారు, ఇంటివారు, కుటుంబీకులు లేక భార్యాపిల్లలని అర్థం. బైత్ అంటే ఇల్లని అర్థం.

దివ్యఖుర్‌ఆన్ ప్రతిపాదకులైన అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఉర్‌వహ్ బిన్ జుబైర్, ఇక్రమహ్(ర) సూరహ్ అహ్జాబ్‌లోని ఆయతులో 'అహ్‌లుల్ బైత్' అనగా ప్రక్త(స) సతీమణులేనని తెలిపారు.

క్రింది సూక్తిని గమనించండి: **"ఓ ప్రవకా! నీ భార్యలతో ఇలా అను: "ఒకవేళ మీరు ప్రాపంచిక జీవితాన్ని, దాని శోభనూ కోరుతూ ఉన్నట్లైతే, రండి, నేను మీకు ఎంతో కొంత ఇచ్చివేసి మంచి పద్ధతి ప్రకారం సాగనంపుతాను. కాని ఒకవేళ మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, పరలోక నివాసాన్ని కోరుతూ ఉన్నట్లైతే, తెలుసుకోండి, మీలోని పుణ్యవతుల నిమిత్తం అల్లాహ్ గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు ."**

పై ఆయతు ద్వారా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సతీమణులు 'అహ్లల్ బైత్' వారు అని తెలుస్తుంది. సాధారణంగా ఆహ్‌లె బైత్ అనగా ఇంటి వారు లేక కుటుంబీకులు అని అర్థం వారిలో భార్యాపిల్లలు వస్తారు. ఉదాహరణకు: 'అహ్‌లె బైత్'లో ప్రవక్త (స) వారి భార్యలు, పిల్లలు-ఖాసిమ్, అబ్దుల్లాహ్, జైనబ్, రుఖయ్యా, ఉమ్మెకుల్సుమ్, ఫాతిమా (ర) పరిగణించబడతారు. అల్లుళ్ళు, భృతజ్ఞులు, మనుమలు గృహస్తులు కాజాలరు. వీరందరూ బంధువులు. ప్రవక్త(స) స్వయంగా హరజత్ ఫాతిమా(ర) వారి భర్త, వారిరువురి పుత్రులు హసన్ హుసైన్‌లను (ర) తమ గృహస్తులలో చేర్చుకున్నారు.

ఇబ్నె అబీ హాతిమ్ ఉల్లేఖనం ద్వారా ఒకసారి హజ్రత్ అయిషా(ర)తో అలీ(ర) గూర్చి ప్రశ్నించగా, ఇలా జవాబిచ్చారు, "నీవా వ్యక్తిని గూర్చడుగుతున్నావా! ఎవరైతే ప్రవక్త(స)కు అత్యంత ప్రియుడు, అతని భార్య ప్రవక్త ప్రియాతిప్రియమైన కూతురు.'

ఆ తరువాత హజ్రత్ అయిషా(ర) : "మహాప్రవక్త ముహమ్మద్(స), హజ్రత్ అలీ(ర), హజ్రత్ ఫాతిమా(ర) , హజ్రత్ హసన్ (ర) హజ్రత్ హుసైన్(ర) లను పిలిచి వారందరిపై ఒక వస్త్రము వేసి 'ఓ అల్లాహ్ వీరు నా గృహస్తులు (ఆహ్‌లె బైత్), వీరి నుండి అశుద్ధాన్ని దూరంచేసి శుద్ధపరచు" అని దుఆ చేసిన ఆ సందర్భాన్ని తెలియపరచారు.

ముస్లిమ్, తిర్మిజీలో హజ్రత్ అబూ సయీద్ ఖుద్‌రీ, హజ్రత్ అయిషా(ర), హజ్రత్ ఉమ్మె సలమా(ర) ద్వారా ఇలాంటివే మరికొన్ని హదిసులు ఉల్లేఖించబడ్డాయి. వీటి ద్వారా ప్రమాణించబడునదేమనగా నిస్సందేహంగా హజ్రత్ అలీ(ర), హజ్రత్ ఫాతిమా(ర), హజ్రత్ హసన్(ర), హజ్రత్ హుసైన్(ర)లు ప్రవక్త(స) గృహస్తులని.

# IMA పిక్నిక్









గతంలో మాదిరి IMA ఈ ఏడాది కూడా విహార యాత్ర కార్య క్రమాన్ని నిర్వహించింది. ఈ ప్రోగ్రామ్‌లో దాదాపు 1000 స్త్రీ పురుషులు, బాల బాలికలు పాల్గొన్నారు.

ఈ ప్రోగ్రామ్ యొక్క ధ్యేయ సూత్రం " హయ్యాలలల్ ఫలాహ్ " (సాఫల్యం వైపుకు రండి). ఉదయం భోజనానంతరం శ్రీ ఖాజా ఆరిఫుద్దీన్ గారు ఇదే అంశం మీద ప్రసంగించారు. తదనంతరం కవి సమ్మేళనసభ జరిగింది. ఇందులో భారత, పాకిస్తాన్ దేశాలకు చెందిన కవి ప్రముఖులు పాల్గొన్నారు. ఆ తర్వాత క్రికెట్, వాలిబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ మొదలగు క్రీడా పోటీలు నిర్వహించబడ్డాయి.




మౌలానా సిరాజుద్దీన్ నద్వీ గారు " వ అమ్మా బినిఅమతి రబ్బిక ఫహద్దిస్ " అనే అంశం మీద జుమా ఖుత్బా ఇచ్చారు. జుమా నమాజు మరియు మధ్యాహ్న భోజ నానంతరం ఐ ఎమ్ ఎ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఒక చిరస్మరణీయమైన, ఆసక్తికరమైన కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో గేయాలా పనతోపాటు ఆకర్షణీయమైన మూడు నాటకాలు కూడా ప్రదర్శించబడ్డాయి. ఈ కార్యక్రమపు యూత్ వింగ్ ధ్యేయ సూత్రం కూడా "హయ్యాఅలల్ ఫలాహ్".

ఈ సందర్భంహో యూత్ వింగ్ (కువైట్ విభాగం) ప్రధాన అధ్యక్షులు శ్రీ మౌలానా ముజాహిద్ ఉమ్రీ గారు యూత్ వింగ్ ఆశయాలు, ఆకాంక్షల గురించి తెలియపర్చడంతో పాటు "ఈ బృందంలో చేరండి' అని యువకులకు పిలు పునిచ్చారు.

అస్ర్ నమాజు అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేయబడ్డాయి. జెట్ ఎర్‌వైస్ తరుపునుండి లక్కీ డ్రా ద్వారా ఇండియాకు వెళ్ళేందుకు 6 టికెట్లు ప్రదానం చేయబడ్డాయి.

ఐ ఎమ్ ఎ ప్రధాన అధ్యక్షుల వారి చివరి ప్రసంగం మరియు మౌలానా సిరాజుద్దీన్ నద్వీ గారి దుఆతో ఈ కార్యక్రమం సుఖాంతంగా, విజయవంతంగా ముగి సింది.

ఈ కార్యక్రమంలో ఐపిసికి చెందిన 96 మంది ముస్లింలు మరియు నవ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



అబూ తఫ్హీమ్
mujq8@yahoo.co.in


# సలాం హైదరాబాద్



హైదరాబాదు ఆంధ్రరాష్ట్రము యొక్క రాజధాని. హైదరాబాదు నగరము సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వానికి, ప్రముఖ చరిత్ర కట్టడాలకు, మసీదులకు, దేవాలయాలకు, హస్తకళలకు ప్రసిద్ధి. హైదరాబాదు భారత దేశములో ఆరవ అతిపెద్ద మహానగరము. అంతేకాదు హైదరాబాదు చుట్టు ప్రక్కల మునిసిపాలిటీలను కలుపుకుపోతే ప్రపంచంలోని మహానగరాలలో 20వ స్థానాన్ని ఆక్రమిస్తుంది.

హైదరాబాదు భారతదేశంలో బాగా అభివృద్ధి చెందిన నగరాలలో ఒకటి. అంతేకాదు సాఫ్టువేరు రంగంలో కూడా మంచి పేరునే సంపాదించింది. హైదరాబాదు మరియు సికింద్రాబాద్లు జంట నగరాలుగా ఖ్యాతి చెందాయి. హుస్సేన్ సాగర్ ఈ రెండు జంట నగరాలను వేరు చేస్తుంది. ట్యాంక్ బండ్ వీటిని కలుపుతుంది. హుస్సేన్ సాగర్ ఇబ్రాహీం ఖులీ ఖుతుబ్ షావలీ 1591లో నిర్మించిన ఒక పెద్ద కృత్రిమ సరస్సు. హైదరాబాదు మధ్యలో ఖులీ ఖుతుబ్‌షా 1591లో ప్లేగు వ్యాధి నిర్మూలనకు చిహ్నంగా చార్మినార్‌ను నిర్మించాడు.

## పుట్టు పూర్వోత్తరాలు



ముహమ్మద్ ఖులీ ఖుతుబ్‌షా పెంఢ్లి చేసుకున్నాడు. ఆమె స్వీకరించి హైదర్ మహల్ అనుసరించి నగరం కూడా చెందింది. ఉర్దు భాష ప్రకారం (నివశించిన స్థలం) అని భారతదేంలో అంగ్లేయుల 'భాగమతి' అనే బంజారా స్త్రీని పెళ్లి తరువాత ఇస్లాం మతం అనే పేరు పెట్టుకుంది. దానిని హైదరాబాదుగా రూపాంతరం హైదర్ (రాజు పేరు) బాదు చెప్పుకోవచ్చు. 1947లో పాలన అంతమయిన తరువాత కూడా అప్పటి నిజాము రాజు స్వతంత్ర్యంగా కొంత కాలం హైదరాబాదు నగరాన్ని పాలించాడు.

## వాణిజ్య వ్యవస్థ



హైదరాబాదు నగరం చెరువులకు పెట్టింది ఐటీ వలన కూడా మంచి ప్రఖ్యాతలు సంపాదిస్తోంది. దగ్గరలోనే ముత్యాల వెండి గిన్నెలు, చీరలు, కలంకారి బొమ్మలు, చేనేత, నూలు వస్త్రాలు ముత్యాలకు, పేరు. ఈ మధ్యన పేరు చార్మినార్‌కు మార్కెట్టు ఉంది. నిర్మల్ మరియు గాజులు, పట్టు, లాంటి మరెన్నో వస్తువులతో ఇక్కడ శతాబ్దాల తరబడి వర్తకం నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో అతి పెద్ద సినిమా నిర్మాణ కేంద్రం రామోజి ఫిలిం సిటీ ఇక్కడే ఉంది. హైదరాబాదులో పేరుగాంచిన పరిశోధనలయాలు మరియు విద్యాలయాలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిశోధనాలయాలు వివిధ రంగాలలో విస్తరించాయి కుడా.

## ఐటీ రంగము

1990 దశకం తరువాత హైదరాబాదులో ఐటీ మరియు ఐటీఇఎస్ కంపెనీలు తామరతంపరగా పెరిగిపోవటం మొదలయింది. అప్పటి నుండి హైదరాబాదుకు సైబరాబాదు అని పిలవటం మొదలెట్టారు. బెంగుళూరు తర్వాత దీనిని రెండో సిలికాన్ వ్యాలీగా పిలిస్తున్నారు. ఈ రంగం వలన హైదరాబాదుకు ఎన్నో పెట్టుబడులు రావడంతో సాంకేతిక రంగంలో హైదరాబాదు దేశమంతా వ్యాపించింది. విద్య మీద ప్రజలు చూపించే శ్రద్ధ ఇక్కడి ఉత్పాదకత, వాణిజ్యం పెరగడానికి దోహదపడ్డాయి. ప్రతిష్మాత్మకమైన ఫ్యాబ్ సిటీ ప్రాజెక్టును సాధించి తానే భవిష్యత్తులో ఐటి కేంద్ర బిందువునని చాటి చెప్పింది.



## విద్య

విద్యపరంగా హైదరాబాదు దక్షిణ భారతదేశంలో ప్రముఖ కేంద్రం. ఇక్కడ రెండు కేంద్ర విశ్వ విద్యాలయాలు, రెండు డీమ్డ్ విశ్వవిద్యాలయాలు మరియు ఆరు రాష్ట్ర విశ్వ విద్యాలయాలు ఉన్నాయి. ఉస్మానియా విశ్వ విద్యాలయం భారతదేశంలో ఉన్న పురాతన విశ్వ విద్యాలయాలలో ఒకటి. సాంకేతిక విద్యకు సంబంధించి జవహర్లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ విశ్వ విద్యాలయం, ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లాంటి విద్యాలయాలు ఇక్కడ ఉన్నాయి. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హైదరాబాదుకు విద్యారంగంలో ఖ్యాతి తెచ్చిన సంస్థల్లో ఇది కూడా ఒకటి. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఇస్లామిక విశ్వవిద్యాలయం అయిన జామియా నిజామియా కూడా ఇక్కడే ఉంది.







## సంస్కృతి

ముస్లిములు, హిందువులు, క్రైస్తవులు వంటి వివిధ మతాల ప్రజలు హైదరాబాదులో పెద్ద సంఖ్యలో ఉన్నారు. సిక్కులు కూడా చెప్పుకో దగ్గ సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ ముస్లిములు సాంప్రదాయంగా ఉంటారు. స్త్రీలు బురఖా ధరించటం, మతపరమైన ఆచారాలను ఖచ్చితంగా పాటించటం వంటివి ఎక్కువగా కనిపిస్తుంది. నవాబుల సంస్కృతి ఆచారాలు ఇప్పటికీ కన్పిస్తాయి. హైదరాబదు రుచులు మిగతా భారతదేశపు రుచులు కంటే భిన్నంగా ఉంటాయి. మొఘలుల రుచులతో కలివిడి తెలంగాణా వంటకాలు ఇక్కడి ప్రత్యేకత. బిరియానీ, బగారా బైంగను (గుత్తొంకాయ), ఖుబానీకా మీఠా, డబల్‌కా మీఠా, హలీమ్, ఇక్కడి ప్రముఖ వంటకాల్లో కొన్ని.

## విమాన రవాణా సంస్థ

శంషాబాదులో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం రాజీవ్ గాంధీ పేరతో 22వ మార్చి 2008లో ప్రారంభించబడింది. ఈ విమానాశ్రయం నుండి భారతదేశంలోని అన్ని ముఖ్య పట్టణాలకు మరియు అంతర్జాతీయ గమ్యములకు విమాన ప్రయాణ సౌకర్యము ఉంది. ఇక్కడి నుండి సంవత్సరానికి 5 కోట్ల మంది విమానా సౌకర్యాన్ని వినియోగించుకోగలరు.






## రైలు రవాణా సంస్థ

హైదరాబాదు జంట నగరమైన సికింద్రబాదులో దక్షిణ మధ్యరైల్వే ముఖ్య కార్యాలయం ఉంది. ఇక్కడ నుండి దేశంలో అన్ని ప్రాంతాలకు రైలు సౌకర్యం ఉంటుంది. హైదరాబాదులో మొత్తం మూడు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. 1. సికింద్రబాదు రైల్వేస్టేషన్ 2. నాంపల్లి రైల్వేస్టేషన్ 3. కాచిగూడ రైల్వేస్టేషన్. ఇది కాక నగరానికి మెట్రో రైలు కుదా వచ్చే సూచనలు ఉన్నాయి.

## రోడ్డు రవాణా సంస్థ

హైదరాబాదు దేశంలోని చాలా నగరాలతో రోడ్డు ద్వారా అనుసంధానమై ఉన్నది. నగరం లోపల కూడా అద్భుతమైన రోడ్లు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యలకు తగ్గించేందుకు ఎన్నో ఫ్లై ఓవర్లు ఉన్నాయి. రోడ్లు చాలా వరకు 3 - లేన్ సౌకర్యము ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రవాణా సంస్థ లెక్కకు మించి సిటీ బస్సులను నడుపుతుంది. ఇక్కడ మహాత్మాగాంధి బస్‌స్టేషన్ --ప్లాట్‌ఫారాలతో ఆసియాలోకెల్లా అతిపెద్ద బస్‌స్టేషన్‌గా పేరుగాచింది.

## గణాంకాలు

2001 జనాభా లెక్కల ప్రకారము నగర జనాభా 70 లక్షలుగా అంచనా వేయబడినది. హైదరాబాదులో ముస్లింల జనాభా ఎక్కువగా ఉంది. ఉర్దూ, తెలుగు, హిందీ ఎక్కువగా మాట్లాడే భాషలు. వ్యాపార లావాదేవీల్లో ఇంగ్లీషు ఎక్కువగానే వాడుతారు. వ్యాపార నిమిత్తం భారత దేశములోని అనేక ప్రాంతముల నుండి ప్రజలు హైదరాబాదుకు వచ్చి స్థిరపడ్డారు.

## ఆకర్షణలు

- ట్యాంక్ బండ్: హైదరాబాదు, సికింద్రబాద్ జంట నగరాలను కలుపుతున్న మార్గము.
- లుంబిని పార్కు: హైదరాబాదులోని ఒక ఉద్యానవనం. బోటులో వెళ్ళవచ్చు. లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.
- పబ్లిక్ గార్డెన్స్: శాసన సభ, జూబిలీ హాలు వంటి కట్టడాలతో కూడిన చక్కటి వనం.
- చార్మినారు: విశ్వఖ్యాతి చెందిన హైదరాబాదు చిహ్నం.
- లాల్ బజార్: చార్మినారుకు సమీపంలో ఉన్న అందమైన గాజుల మార్కెట్లు.
- మక్కా మసీదు: చార్మినారుకు నైరుతిలో ఉన్న రాతి కట్టడం.
- గోల్కొండ కోట: భారత్‌లో ప్రసిద్ధి చెందిన ప్రాచీన కోటల్లో ఇది ఒకటి.
- హుస్సేన్ సాగర్: హైదరాబాదు- సికింద్ర బాదుకు వేరువేస్తున్న మానవనిర్మిత కాసారం.
- సాలార్‌జంగ్ మ్యూజియం: పురాతన వస్తువులతో కూడిన పెద్ద సంగ్రహాలయమిది.
- బిర్లా ప్లానిటోరియం: నగర మధ్యలో నౌబత్ పహాడ్ గుట్టపై ఉంది.
- అలాగే ఓషన్ పార్కు, మౌంట్ ఒపెరా వంటి థీమ్ పార్కులు కూడా కలవు.
- రామోజీ ఫిల్మ్ సిటీ.
- ఇస్కాన్ దేవాలయం: ఈ దేవాలయం అబిడ్స్ రోడ్డుపై ఉంది.
- పుల్లారెడ్డి స్వీట్స్
- బిగ్ బజార్

# నెలవంక ఉత్తరాలు




## చిన్న విన్నపం

గౌరవనీయులైన ఎడిటర్ గారికి సలాములు చేయుచు వ్రాయడం ఏమనగా నెలవంక మాస పత్రిక మాకెంతగానో నచ్చింది. అన్ని విషయాలు విపులంగా వివరించడం జరుగుతున్నది. అల్లాహ్ దయ వల్ల ఈ కృషి ఎల్లవేళలా కొనసాగుతూ ఉండాలని మా అందరి ప్రార్థన.

మా యొక్క చిన్న విన్నపం ఏమనగా నెలవంక యందు ప్రశ్నలు - జవాబుల పేజిని కేటాయించండి. ఇస్లాం గురించి తెలియని విషయాలు, అపోహాలు, అను మానాలు, తెలియజేయండి. నవ ముస్లిం సోదరులకు దీని ద్వారా చాలా లాభం చేకూరుతుంది. మాదో ప్రశ్న–

అసర్ నమాజు తర్వాత ఫజర్, జుహార్‌ల ఫర్జ్ ఖజా నమాజు చేయవచ్చునా? ఖజా నమాజు ఏ సమయంలో ఎన్ని రకాతులు చేయాలో తెలిపేయండి.

ఇట్లు


నవ ముస్లిం సోదరులు
యువ ముస్లిం సోదరులు
అరఫుల్లా ఖాన్, సలీమ్, గౌస్ పీర్,
అబ్దుల్లా, అయ్యూబ్, అల్‌తాఫ్,
షరీఫ్, హబీబ్, జాఫర్, జాకిర్.

**జ)** ఐదు పూటల ఫర్జ్ నమాజులలో క్రమాన్ని పాటించడం తప్పనిసరి (వాజిబ్). అంటే ముందు ఫజ్ర్ తర్వాత జుహ్ర్ ఆతర్వాత అరస్... అంచేత ఖజా నమాజుల విషయంలో సైతం ఇదే పద్ధతిని పాటించాలి. అస్ర్ నమాజు సమయం సూర్యాస్తమయం వరకు ఉంటుంది గనక ముందు ఫజ్ర్, జుహ్ర్ ఖజా నమాజులు చేసి ఆ తర్వాత అసర్ నమాజు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం దగ్గర గల మంచి పండితులను సంప్రదించగలరు. –ఎడిటర్

## నెలవంకకు స్వాగతం

ఇస్లాం ధర్మము చాలా స్పష్టమైనది, స్వచ్ఛమైనది. ఇందులో మంచీచెడులు స్పష్టంగా విశదీకరించబడ్డాయి. ఇస్లాం ధర్మం తెలుసుకుని తదనుగుణంగా నడుచు కున్నట్లయితే మనిషి జీవితం సార్థకం అవుతుంది. ఎందుకంటే అల్లాహ్‌కు మించిన దైవం ఇంకెవ్వరూ లేరు. అల్లాః తఆలా భూమి ఆకాశాల సృష్టికర్త. ఆయన ఆదేశాలకు శిరసావహించడమే మనందరి విద్యుక్త ధర్మం.

వి. సిద్దూ హుసైన్ (కబద్)




## మదిని వెలిగించిన దీపం నెలవంక

గౌరవనీయులైన నెలవంక సంపాదకుల వారికి, మీరు ప్రచురిస్తున్న నెలవంక గత కొన్ని సంవత్సరాలుగా శుభవార్తను నిండు తెలుగు తేనెలలో యావత్ తెలుగు ప్రజానికానికి తనదైన బాణీలో అంద జేస్తోంది. ఈ అమూల్య సమాచారాన్ని అందజేస్తున్న రచయితలందరికీ పేరుపేరున ధన్యవాదాలు.

1) గత సంవత్సరం సెప్టెంబరు నెలలో వెలువడిన "దగాకోరు దేవుళ్ళను ప్రజా జీవితాల నుండి ఏరి వేయాలి" అన్న సయ్యద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు వ్రాసిన వ్యాసం చాలా బాగుంది. అమాయక ప్రజలను మేలుకోల్పడం బ్రహ్మాండం. ఈ వ్యాసం మళ్ళీ మళ్ళీ చదివితే మందగించిన తెలివిని కడిగి వాస్తవలోకాన్ని పరిచయం చేసే మంచి వ్యాసం ఇది. చాలా థాంక్స్! ఈ నెలవంక చదివితే ప్రతి ఒక్కరికి మంచి గుణాలు అలవడతాయి.

2) అక్టోబర్ నెలలో అబ్దుల్ హఖ్ గారు అందించిన "ఆర్థికపరమైన ఆరాధన జకాత్" చాలా చక్కగా ఉంది. ఎవరైనా చదివి ఆలోచిస్తె ఎలా జీవించాలో నేర్పుతుంది. అడుగున పడ్డ అభిమానం కట్టలు తెంచుకుని పైకి వచ్చేలా వ్రాశారు. ఆ వ్యాసం ప్రతి ఒక్కరు చదవాలి. షుక్రన్ సార్!

3) శాంతి ప్రియ గారు "షైతాన్‌తో ముఖాముఖి" అన్న వ్యాసంలో మానవాళికి బహిరంగ శత్రువు అయిన షైతాన్ ఎత్తుగడలు మనిషిని ఎంత తప్పు దారి పట్టిస్తాయో తెలిపారు. ఇది మనిషిని మేల్కొల్పుజేస్తుంది. అస్సలాము అలైకుమ్ మేడంగారు! చాలా అద్భుతంగా వ్రాస్తున్నారు. ఇంకా మాకు ఇటువంటి మరిన్ని వ్యాసాలు అందిస్తారని కోరు కుంటున్నాము. మన నెలవంక నీతిని తెస్తుంది. నిజాయితీని నిలుపుతుంది ఇన్షాఅల్లాహ్!

– పిడుగు అహ్మద్ (కబద్)

# వివేచన

**మీరు ప్రజలకు చేసిన మేలును బహుశా వారు రేపు మర్చిపోవచ్చు. అయినా.. మీరు వారికి మేలు చేస్తూనే ఉండండి.**

హజ్రత్ అబుల్ అహ్వాస్ జుష్మీ (ర.జి) కథనం: తన తండ్రి మహా ప్రవక్త(స)తో ఇలా అడిగారని తెలియపర్చారు. 'ఓ దైవ ప్రవక్తా(స)! ఒకవేళ ఒక వ్యక్తి దగ్గర నేను అతిథిగా ఉన్నప్పుడు అతను నా పట్ల మంచిగా వ్యవహరించలేదు, నన్ను గౌరవించలేదు. మరి ఆ వ్యక్తి నా దగ్గర అతిథిగా వచ్చినప్పుడు అతనితో నేను కూడా అదే విధంగా ప్రవర్తించాలా? లేక మంచిగా మసలుకోవాలా?' అందుకు మహా ప్రవక్త(స) ఇలా బదులిచ్చారు: "కాదు ! నువ్వు మాత్రం అతనికి చేయాల్సిన అతిథి మర్యాదలను నిర్వర్తించు". (తిర్మిజీ)






# నెలవంక

మీ వాణిజ్య ప్రకటనలను స్వాగతిస్తోంది.
అధర్మమైన, అసభ్యకరమైన, అశ్లీలంతో కూడిన
విషయాలు తప్ప మిగిలిన ప్రకటనలన్నీ వేయబడతాయి.

మండే ఎడారిలో చల్లని వెన్నెల **నెలవంక**
గల్ఫ్‌లో నెలనెలా వెన్నెలను కాచే ఆధ్యాత్మిక మాసపత్రిక

# నెలవంక

| | Description | Advertisement Rate | 30% Discount for One year | 20% Discount for one Month |
|---|---|---|---|---|
| 1 | Inside Page of Front Cover | KWD 150 | KWD 105 | KWD 120 |
| 2 | Inside Page of Back Cover | KWD 150 | KWD 105 | KWD 120 |
| 3 | Single Page Inside | KWD 100 | KWD 70 | KWD 80 |
| 4 | Two middle pages | KWD 200 | KWD 140 | KWD 160 |
| 5 | Back Cover Page | KWD 200 | KWD 140 | KWD 160 |

Half Page : Half of the above mentioned rates
Quarter Page : Quarter of the above mentioned rates

contact:
email:mujq8@yahoo.co.in, Tel.No: 2444117 ext.110, 66104547
4711141 ext.104, 66357548